## అనుమానాస్పద రీతిలో బాలిక మృతి



వి.కోట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త
మండలంలోని పచా ్చరమాకులపల్లి సమీపంలోని అగ్గార్లబండ ప్రాంతంలో ఓ బాలిక అనుమానాస్పద రీతిలో మృతి చెంది ఉండడాన్ని గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. కుమ్మరమడుగుకు చెందిన క ృష్ణప్ప కుమారె_ పుష్పకు గతంలో కర్ణాటకకు చెందిన వ్యక్తితో వివాహం చేశారు. ఆమెకు ముగ్గురు పిల్లలు. కాగా పుష్ప కుమార్తె అయిన పల్లవి (15) అనుమానాస్పద రీతిలో అగ్గార్ల బండ వద్ద మామిడితోటలో చెట్టుకు వేలాడుతున్న దృశ్యాన్ని పశువుల కాపరులు కనుగొన్నారు. పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం పలమనేరు ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## శివయ్య సన్నిధిలో ప్రజ్ఞానంద సరస్వతి



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 2 ప్రభాతవార్త
పెనుగొండ పుణ్యక్షేత్రానికి చెందిన ఆశ్రమ పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి బుధవారంతమ అనుచరులతో వాయులింగేశ్వరుని స్వామి దర్శనానికి వచ్చారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద వేదపండితులతో మేళ తాళాలతో పిఆర్ఓ రవి సారధ్యంలో స్వాగతం పలికారు.స్వామి అమ్మవార్ల దర్శనానంతరం వారికి వేద పండితులచే ఆలయం నుంచి ఫల,పుష్పాలను అందించారు.వారికి ఏర్పాట్లను ఆలయ ఎఇఓ లోకేష్‌రెడ్డి,సుబ్రమణ్యం తదితరులు స్వాగతం పలికారు. అలాగే శ్రీకాళహస్తికి చెందిన ఆర్యవైశ్యసమాజంకు చెందిన జూలుగంటి మురళి,రమేష్,పొట్టి భాస్కర్ గుప్తా, జాలాది మోహన్‌పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

### మిర్చి రైతులకు

# మద్దతు ధర పెంచండి

## - పార్లమెంటులో వైసీపీ ఎంపీ మద్దిల గురుమూర్తి



వెంకటగిరి, ఏప్రిల్ 2, ప్రభాతవార్త
మిర్చి రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభం, ముఖ్యంగా దిగుబడులు తగ్గిపోవడం, సాగు వ్యయాలు పెరగడం, మార్కెట్ ధరలు భారీగా పడిపోవడం వంటి సమస్యలు రైతుల జీవనోపాధిపై తీవ్రమైన ప్రభావం చూపుతున్న నేపద్యంలో వైసీపీ తిరుపతి ఎంపి గురుమూర్తి బుధవారం పార్లమెంటులో ప్రత్యేక ప్రస్తావన 377 ద్వారా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. గుంటూరు జిల్లా ప్రపంచ ప్రఖ్యాత మిరప రకాలైన తేజ, బ్యాడ్గి, డిడి బెస్ట్ వంటి మిరప ఉత్పత్తికి ప్రసిద్ధి చెందిందన్నారు. అయితే, ప్రస్తుతం మిరప రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు. మిర్చి సాగుకి పెట్టుబడులు భారీగా పెరిగి ఎకరానికి రూ.2.5 లక్షలకు చేరుకున్నాయని తెలిపారు. కాగా గతేడాది క్వింటాల్‌కు రూ.22 వేలు ఉన్న మిర్చి ధర ఇప్పుడు రూ.10 వేల కంటే తకువకు పడిపోయిందని ఆవేధన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎలాంటి మద్దతు లేకపోవడంతో రైతులు ఎకరానికి రూ.50 నుంచి 60 వేల వరకు నష్టపోతున్నారని పేర్కొన్నారు. గుంటూరు మిర్చి యార్డు, సత్తెనపల్లి రోడ్డులో పెద్ద సంఖ్యలో రైతులు ధర్నా చేస్తున్న విషయాన్ని కేంద్ర ప్రభత్వం దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు సరైన మద్దతు ధర దక్కకుండా ధరలు పతనమయ్యేలా దళారీలు రాష్ట్ర ప్రభుత్వంతో చేతులు కలిపినట్లు ఆరోపణలు ఉన్న విషయాన్ని సభలో ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం మార్కెట్ ఇన్టర్వెన్షన్ స్కీమ్ ద్వారా సహాయం అందిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఆ నిధులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల వల్ల రైతుల చేతికి చేరని విషయాన్ని ఎత్తి చూపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలవాల్సిన సమయంలో, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం బదులుగా ప్రతిపక్షంపై విమర్శలు చేయడానికే పరిమితం అవుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తక్షణం స్పందించి మిర్చి క్వింటాల్‌కు రూ.18 వేల చొప్పున కొనుగోలు చేసేలా చర్యలు తీఊకోవాలని , రైతులకు న్యాయం చేయాలని కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రిని కోరారు. మిర్చి రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# సామాన్యుడికి సంతోషదర్శనమ్!

## -ఏఐ అమలు దిశగా టిటిడి అడుగులు!



ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:
"ఏడుకొండలవాడా గోవిందా నామంతో వ్యయప్రయాసలకోర్చి తిరుమలకు వస్తున్న వేలాదిమంది సామాన్యభక్తులకు తక్కువ సమయంలో సంతృప్తికరంగా శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునేలా టిటిడి కార్యాచరణ సిద్ధం చేస్తోంది. దీనిపై బుధవారం అమరావతిలో సిఎం చంద్రబాబునాయుడుకు టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు సారథ్యంలోని టిటిడి ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఏఐ(కృత్రిమమేధ)టెక్నాలజీ అమలుచేసేందుకు ప్రజంటేషన్‌చూపారు. ఈ విధానంలో తొలుత భక్తుడి ముఖగుర్తింపు రికార్డుచేసిన తరువాత ఓ కియోస్క్ నుండి బార్‌కోడ్ రశీదు టోకెన్ వస్తుంది. అందులో భక్తుడి వివరాలు,దర్శనం సమయం ఉంటుంది. నిర్దేశిత సమయానికి భక్తులు క్యూలైన్‌లో ప్రవేశిస్తే ముఖగుర్తింపు ఆధారంగా స్వయంచాలికమైన (ఆటోమేటిక్‌గా)గేటు తెరచుకుంటుంది. ఈ విధానాన్ని రెండు సంస్థల ప్రతినిధులు టిటిడి ముందు డెమో కూడా ఇచ్చారు. ఆ రెండు సంస్థలు 14 దేశాల్లో ఏఐ సంబంధిత సేవలందిస్తున్నాయని టిటిడి పాలకమండలి తెలిపింది. ప్రస్తుతం సామాన్యభక్తులకు వీలైనంత వరకు ఐదారు గంటల్లోనే ఆ దేవదేవుని దర్శనం చేయించేలా చూస్తున్నారు. ఈ సమయాన్ని మరింతగా కుదించాలనేది టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు ఆలోచన. ఇక రానున్న వేసవి సెలవుల్లో సామాన్యభక్తులు వీలైనంత సులభంగా, సంతోషంగా శ్రీవారిని దర్శనం చేసుకునేలా చూడాలనేది సిఎం ఆదేశాలు. క్యూలైన్లలో సామాన్యభక్తులకు కనీస సౌకర్యాలు మెరుగుపరచి, క్యూలైన్లలో నిరంతరాయంగా నాణ్యతతో కూడిన అన్నప్రసాదాలు, పాలు, టీ, తాగునీరు అందించేలా చూడాలని స్పష్టం చేశారు.

## పనుల పురోగతిని మనసు పెట్టి పూర్తి చేయాలి

### - ఫారం ఫాండ్ నిర్మాణాలపై రైతులకు అవగాహన : కలెక్టర్

చిత్తూరు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:
జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరు అయిన పనుల పురోగతిని మనసు పెట్టి పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో బుధవారం ఉపాధి పనులపై కలెక్టర్ సుమిత్‌కుమార్ ఎపిడిలు, ఎపిఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధి పనుల కింద పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, భూగర్భ జలాల పెంపు కోసం చేపట్టిన ఫారం ఫాండ్ నిర్మాణాలపై ఎక్కువ శ్రద్ధ కేంద్రీకరించాలన్నారు. రైతులకు ఫారం ఫాండ్ నిర్మాణాలపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించి ప్రతి ఒక్కరు నిర్మాణాలు చేపట్టేలా చేయాలన్నారు. అలాగే ప్రతి మండలంలో మోడల్ ఫారం ఫాండ్ నిర్మాణాలు చేపట్టాలన్నారు. అలాగే ఫారం ఫాండ్ నిర్మాణాలను నాణ్యతతో చేపట్టాలని, మేట్స్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇతర సంబంధిత అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించి రైతులకు ఉపయోగపడేలా ఫారం ఫాండ్లను పెద్ద ఎత్తున నిర్మాణాలు చేపట్టాలన్నారు.

## గ్రామాల అభివృద్ధి తెదేపాతోనే సాధ్యం

### 30 లక్షలతో సిసి రోడ్లు, మినీ గోకులం ప్రారంభోత్సవం



చిల్లకూరు, ఏప్రిల్ 2, ప్రభాతవార్త
రాష్ట్రంలో గ్రామాలు అభివృద్ధి చేయడంలో తెలుగుదేశం పార్టీకి సాధ్యమని గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ అన్నారు. బుధవారం పల్లె పండుగ అనే కార్యక్రమంలో భాగంగా మండలంలోని తణుకుమాల గ్రామ పంచాయతీలో 12 లక్షలతో సిసి రోడ్లు 10 లక్షలతో సైడ్ కాలువలు 6.9 లక్షలతో మినీ గోకులం, పశువులు తాగునీటి తొట్టె 93 వేలుతో నిర్మించిన పనులను ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌తో పాటు ప్రముఖ పారిశ్రామికవేత్త తానంకి నానాజీతో కలిసి ప్రారంభించారు. ముందుగా పార్లపల్లి గ్రామంలో ఏర్పాటైన ఉన్న మినీ గోకులం ప్రారంభించారు. అనంతరం తోణుకుమాలలో శిలాఫలకం ఆవిష్కరించిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు అభివృద్ధి జరిగిందంటే ఒక తెలుగుదేశం పార్టీ హయాంలోని వారు చెప్పారు. గడిచిన వైసిపి ప్రభుత్వ హయాంలో ఏ గ్రామంలో కూడా రోడ్లు వేసిన పాపాన పోలేదన్నారు. అప్పుడు ఏర్పడ్డ గుంటలని ఇప్పుడు మన ప్రభుత్వంలో నాణ్యమైన రోడ్లు వేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చేయడంలో మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి సాధ్యపడుతుందని ఈ విషయాన్ని ప్రతి ఒక్క నాయకుడు కార్యకర్త ప్రజలందరూ తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఉచ్చూరు వెంకటేశ్వర్ రెడ్డి, ఏపీ డి పి వరప్రసాద్, తాసిల్దార్ కే శ్రీనివాసులు, ఎంపీడీవో గోపి, నాయకులు గుండాల లీలావతి, దువ్వూరు రాజశేఖర్ రెడ్డి, మేకల కుమారు, సర్పంచ్‌లు ఓడూరు సత్యనారాయణ రెడ్డి, త్రివిక్రమ్, భూపతి, నాయకులు అరిపి నేటి భాస్కర్, భాస్కర్ రెడ్డి ప్రవీణ్ కుమార్ రెడ్డి, సర్వూర్ నాగేశ్వరావు, ముగ శంకరయ్య, వెంకట కృష్ణయ్య, కోటసతీష్, అన్నం మునిశేఖర్, ఒబ్బాయి శివకుమార్, ఆవుల ప్రభాకర్, ఏపీ ఓ గిరి, తదితరులు పాల్గొన్నారు.

# చంద్రప్రభపై కోదండరాముడు అభయం



తిరుపతి(రవాణ),ఏప్రిల్ 2ప్రభాతవార్త
తిరుపతి కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవరోజు బుధవారం రాత్రి స్వామివారు చంద్రప్రభవాహనంపై చల్లని చూపులతో కటాక్షించారు. ఆలయం నుండి బయలుదేరిన కోదండరాముని వాహనసేవలో భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. కోదండరామునికి సూర్యచంద్రులు రెండునేత్రాలు. ఉదయం సూర్యప్రభలో ఊరేగిన శ్రీరామచంద్రుడు రాత్రి నిశాకరుడైన చంద్రప్రభతోకూడిన వాహనంపై విహరించాడు. చంద్రుడు భగవంతుని మారురూపమే. చంద్రోదయం కాగానే కలువలు వికసిస్తాయి. సాగరుడు ఉప్పొంగుతాడు. చంద్రప్రభవాహనంపై కోదండరాముడ్ని చూడగానే భక్తనేత్రోత్సవాలు వికసించాయి. ఈ కార్యక్రమాల్లో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ మునిశంకర్ , ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్,అర్చకులు, భక్తులు పాల్గొన్నారు

**-నేడు రథోత్సవం:**
కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదవరోజు గురువారం ఉదయం రథోత్సవం వైభవంగా జరగనుంది .ఉదయం 5.10గంటలకు మీన లగ్నంలో స్వామివారు రథాన్ని అధిరోహించి 9గంటల వకు ఆలయ నాలుగుమాఢవీధుల్లో విహరించనున్నారు.

### నత్త నడకన వరదరాజస్వామి

# ఆలయ పునర్నిర్మాణ పనులు

## పట్టించుకోని నాయకులు: చొరవ చూపని అధికారులు

## ఉదాసీనంగా కాంట్రాక్టర్



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 2 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రికి ముందు అభివృద్ధి పనుల్లో హడావిడి తరువాత కనబడటం లేదు. ఇందుకు నిదర్శనం శ్రీ ప్రసన్న వరదరాజ స్వామి ఆలయ నిర్మాణం. ఈ పనులను వైకాపా హయాంలో అర్హత లేని ఓ కాంట్రాక్టర్‌కు అధికార పార్టీ నాయకుడు నజరానాగా అందించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నాయకుడు కానీ కొత్తగా బాధ్యతలుచేపట్టిన ఇఓ వరదరాజ స్వామి ఆలయం వైపు కన్నెత్తి చూడలేదు. మహాశివరాత్రి సందర్భంగా పరుగులు తీసిన పనులు తరువాత పట్టించుకునే దిక్కులేక పోయింది. కూటమి ప్రభుత్వం వచ్చి 10 నెలలు కావస్తున్నా పనుల్లో చురుకు కనబడలేదు.పనులు నత్తనడకలను మరిపిస్తుంది.

**అంతా సిద్ధం:ఆచరణే ప్రశ్నార్థకం**
శ్రీకాళహస్తీశ్వరాలయం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రసన్న వరదరాజస్వామి ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించిన దేవాదాయశాఖ వద్ద ఉన్న అవరోధాలను తొలగింప జేసారు.వైకాపా హయాంలో మొదట రూ.4కోట్లతో అంచనాలు తయారు చేసి అనుమతి పొందింది.కానీ స్థపతి పరిశీలించిన తరువాత ఆలయాన్ని పూర్తి తొలగించి పునర్నిర్మాణం చేపట్టాల్సి ఉందని సూచించటంతో ఆ అంచనాలు కాస్త అమాంతంగా రూ.7కోట్లకు పెంచుకున్నారు. అలాగే మొదట నాలుగు లేయర్లకే అనుమతించారని కానీ ఆలయాన్ని 15లేయర్లుగా నిర్మించాల్సి ఉందని స్తపతి దృష్టికి తీసుకురాగా ఆయన అనుమతించారు. ఆలయ నిర్మాణంలో చోటు చేసుకున్న ఇబ్బందులు తొలగించినా పనులు ముందుకు సాగటం లేదు. ఇప్పటికి 7 లేయర్ల పనులు పూర్తి అయ్యాయి. ఆలయ నిర్మాణానికి సంబంధించిన రాయి సిద్దంగా ఉంది. కానీ సాక్షాత్తు శాసనసభ్యుడు స్వగ్రామానికి చెందిన కాంట్రాక్టరే పర్యవేక్షిస్తున్నారు.కానీ ఎందుకో రాయి మీద రాయి ఎక్కటం లేదు.

### కుప్పానికి అంతర్జాతీయ

# సంస్థలను తీసుకొస్తాం

## - కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్



కుప్పం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త
సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు కుప్పానికి పలు అంతర్జాతీయ సంస్థలు తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కడ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం ఆదేశాలతో కుప్పంలో పలు అభివృద్ధి పనులు ముందుకు సాగుతున్నాయన్నారు. ఐదేళ్ల కాలంలో కుప్పంలో 30వేలమందికి ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా సిఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. అందులో ఇప్పటికే పలు సంస్థల ద్వారా 10నుంచి 12వేల ఉద్యోగాలు ఖరారుచేశామన్నారు. అలీప్, మదర్ డెయిరీ పరిశ్రమల ద్వారా అధికమందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కుప్పం మున్సిపల్ అభివృద్ధికోసం టౌన్‌అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారుల బృందం సైతం ఈనెల 11న కుప్పం రానుందన్నారు. కుప్పం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించడంతో పాటు జూన్ నెలనుంచి అభివృద్ధి పనులు మున్సిపాలిటీలో మొదలుపెడతామన్నారు. అండంగ్రౌండ్‌డ్రైన్లు, విద్యుద్దీకరణ, పట్టణ పార్కుల అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్నారు. కుప ్పంలో ఆధునాతన మాల్ ఏర్పాటుచేస్తామన్నారు. కుప్పంలో పకా ్క ఇళ్లకు 15వేల దరఖాస్తులు అందాయని వాటిలో 11వేల మంది దాకా అర్హులు ఉండవచ్చున్నారు. కేవలం కొంతమందికోసం మాత్రమే స్థల సేకరణ జరపాల్సి ఉంటుందన్నారు. మే నెలలో ఇళ్లు మంజూరవుతాయన్నారు. కడ ద్వారా తాగునీటి సమస్య పరిష్కారంకు ఇప్పటికే 4కోట్ల వ్యయంతో బోర్లు, పైపులైన్లు వేయించామన్నారు. శాశ్వత తాగునీటికోసం గండిపేట పైపులైను పనులకు డిపిఆర్ సిద్ధమవుతోందన్నారు.

1200 ఎకరాల్లో ఎయిర్‌పోర్టుకు ప్రతిపాదనలు : కుప్పంలో 1200 ఎకరాల్లో ఎయిర్‌పోర్టుకు ప్రతిపాదనలు పంపినట్లు కడ పి.డి. వికాస్ మర్మత్ తెలిపారు. మరో 600 ఎకరాలు పరిశ్రమలకు కేటాయిస్తామన్నారు. పొగురుపల్లి వద్ద సైతం 50ఎకరాలు పరిశ్రమల ఏర్పాటుకు గుర్తించామన్నారు. త్వరలోనే కుప్పంలో మైనామహిళ సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవడం జరుగుతుందన్నారు. వర్క్‌ఫ్రం హోం ప్రారంభిస్తామన్నారు. కుప్పంలో 3482 మందికి దీపం 2 పథకంలో గ్యాస్ సిలిండర్లు మంజూరు చేస్తామన్నారు. 2026 డిసెంబర్ కల్లా కుప్పంలో 100శాతం ఇంటింటికీ సోలార్ కరెంట్ పూర్తి చేస్తామన్నారు.

## పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

### - జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్



తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త
జిల్లాలో ప్రమాదకర రసాయన ఉత్పత్తుల పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ఫ్యాక్టరీలలో ఆకస్మికంగా జరిగే ప్రమాదాల సంక్షోభ నివారణ చర్యలపై డెప్యూటీ చీఫ్ ఇనిస్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.రామకృష్ణారెడ్డి, ఇనిస్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ సుధాకర్ రావు, జిల్లా ఫైర్ ఆఫీసర్ జె.రమణయ్య,శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రమాదకర రసాయన ఉత్పత్తుల పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్లాని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఆకస్మికంగా ఫ్యాక్టరీలలో ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, త్రాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్‌లు వంటి మౌళిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఏదైనా ప్రమాదం జరిగినపుడు అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు స్పందించేలా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, అత్యంత ప్రమాదకర కర్మాగారముల ప్రతినిధులు పాల్గొన్నారు.

# టిటిడిలో కుర్చీలు కదులుతాయ్!

## పాతసార్లకు గుడ్‌బై... కొత్తసార్లు ఎవరొస్తారో!?

## -భక్తుల కానుకలకు ఇక పూర్తిజవాబుదారీతనం -వందశాతం ప్రక్షాళనకు సిఎం ఆదేశం



తిరుమల,ఏప్రిల్ 2ప్రభాతవార్తప్రతినిధి:
ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వంలో నమ్మకస్థులుగా వ్యవహరిస్తూ, వైసిపి నేతలు, గత పాలకమండలి పెద్దలు చెప్పిందే వేదంగా చేసిందే చట్టంగా పనిచేసిన అధికారుల కుర్చీలు ఇక కదలనున్నాయి. టిటిడిలో నిబంధనలకు విరుద్ధంగా ఏళ్ళతరబడి తిష్టవేసుకుని కూర్చున్న పలువురు అధికారులు,ఉద్యోగులు చివరకు తెల్లఏనుగులను సాగనంపడానికి చర్యలకు ఉపక్రమించనున్నారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటై పదినెలలు కావస్తున్నా....నూతన టిటిడి పాలకమండలి కొలువుదీరి ఆరునెలలు పాలన సాగిస్తున్నా పాతవారిని, వైసిపి నమ్మిన బంటులను ఎందుకు సాగనంపలేదనేది బుధవారం సిఎం చంద్రబాబునాయుడు సుదీర్ఘసమీక్షలో టిటిడి అధికారులకు చురకలు అంటించారు. ముఖ్యంగా టిటిడి ఈఓ జె.శ్యామలరావు రాష్ట్రఉన్నతవిద్యాశాఖ నుండి టిటిడికి వచ్చి పదినెలలు పైగా కావస్తోంది. టిటిడి అదనపు ఈఓగా చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఐఆర్ఎస్ శాఖ నుండి టిటిడికి డిప్యూటేషన్‌పై వచ్చి పదినెలలు అనుభవం వస్తోంది. ఈ నేపథ్యంలో టిటిడిపై పూర్తిస్థాయిలో సమగ్రంగా పట్టుసాధించుకున్న ఈ ఇద్దరు అధికారులు పాతవారిని సాగనంపాలని సిఎం స్పష్టమైన ఆదేశాలిచ్చారు. దీంతో ఇప్పుడు టిటిడి జెఈఓ నుండి క్రిందిస్థాయిలో తిరుమలలో రెవెన్యూ అధికారి, అటవీశాఖ అధికారి, తిరుపతి విఎస్ఓ, ఎస్వీబిసిలో తెల్ల ఏనుగులు, టిటిడిలో విశ్రాంత అధికారులు, పలు విభాగాల్లో తెల్ల ఏనుగులు పదుల సంఖ్యలో కుర్చీలు కదలనున్నాయి.వీరేగాక తిరుపతి బర్డ్ ఆస్పత్రి డైరెక్టర్ పోస్టుతోబాటు టిటిడి జెఈఓ, సివిఎస్ఓ పోస్టును ,ఎస్వీబిసి ఛైర్మన్ పదవిని కూడా మరింత సమర్థవంతమైన వ్యక్తులను నియమించనున్నారు. మరీ టిటిడికి రానున్న కొత్తసార్లు ఎవరనేది ఇప్పుడు అధికారవర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. ఏకంగా టిటిడిలో ఇప్పటికే ఖాళీ అయిన ఒక జెఈఓ పోస్టుతో బాటు మరో జెఈఓను కొత్తవారితోనే భర్తీచేయనున్నారనేది స్పష్టమైంది. ఏస్థాయిలోనూ అనుభవజ్ఞులు అవసరం పేరుతో ఉండనీయకుండా చూడాలని, వందశాతం ప్రక్షాళన జరగాలని సిఎం చంద్రబాబు టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి స్పష్టంగా ఆదేశాలిచ్చారు. తిరుమలలో అమలవుతున్న సేవలు, భక్తులకు దర్శనం, వసతి కల్పన తదితర వాటిపై అభిప్రాయసేకరణలో వచ్చిన అంశాలపై సమీక్షించి చర్చించి అమలుచేస్తే భక్తులు ఆనందం చెందుతారన్నారు. రానున్న 50ఏళ్ళ అవసరాలకు అనుగుణంగా టిటిడిని తీర్చిదిద్దాలనేది సిఎం ఆకాంక్ష. భక్తుల కానుకల నిధులను దుబారా చేయొద్దని, ఏది అవసరమో ఆ పనులు మాత్రమే చేయాలని సూచించారు. దేవుని సొమ్ము ఒక్కరూపాయి కూడా దుర్వినియోగం కాకూడదని, వందలకోట్ల నిధులను అనేక కార్యక్రమాలు ఖర్చు చేయడం, అంతర్గత ఆడిటింగ్ తోబాటు కాగ్ ఆడిట్ జరిపించాలనేది భక్తుల నుండి వస్తున్న విజ్ఞప్తులు, సూచనలతో సిఎం అభిప్రాయం వ్యక్తం చేయడంతో టిటిడి అధికారులు,పాలకమండలిలో మరింత బాధ్యత పెంచారనేది చెప్పకనే తెలుస్తుంది. ఇక టిటిడి అనుబంధ ఆలయాల అభివృద్ధిపై టిటిడి అధికారులు సిఎంకు ప్రజంటేషన్ ఇచ్చారు. గత మార్చి 9వతేదీ నుండి 14వరకు భక్తుల నుండి సేకరించిన అభిప్రాయ సేకరణపై అన్నప్రసాదం, వసతి కల్పన, సేవలు, రథసప్తమిరోజు వాహనసేవలు, గ్యాలరీల్లో సౌకర్యాలుపై 74శాతంమంది భక్తులు అద్భుతంగా ఉన్నాయని వెల్లడించారు. మరో 22శాతంమంది బావున్నాయని, 3శాతంమంది పర్వాలేదని తెలిపారని సిఎంకు విన్నవించారు.

# సత్వరం పిఆర్‌సి ఏర్పాటు

## - కలెక్టరేట్ ఎదుట ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా

చిత్తూరు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:
సత్వరం 12వ పిఆర్‌సిని ఏర్పాటు చేయాలని, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్ ఎదుట ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుండి ప్రారంభమైన ఈ ఆందోళనను ఉద్దేశించి ఫ్యాప్టో ఛైర్మన్ మణిగండన్ మాట్లాడుతూ పాఠశాల విద్యను విధ్వంసం చేసిన జిఒనెం.117ను సత్వరం రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తే ప్రభుత్వం అంగీకరించిందన్నారు. జిఒనెం.117 అమలుకు మందు ఉన్న తెలుగు మీడియం, మైనర్ మీడియంలను పునరుద్ధరిచడానికి ప్రస్తుత ప్రభుత్వం అంగీకరించకపోవడం బాధాకరమన్నారు. నూతన జాతీయ విద్యావిధానంలో సైతం స్థానిక భాషలో బోధన చేయాలని సూచించినా, తెలుగు భాష ఆత్మభిమానం పునాదిగా ఏర్పడిన ప్రభుత్వం సైతం తెలుగు మీడియంను రద్దుకు కంకణం కట్టుకోవడం ఆందోళన చెందుతున్నామన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు విధి నిర్వహణలో నిమగ్నమై పని చేయడానికి ఇన్ని ఆర్థికపరమైన



అడ్డంకులు ఉన్నాయని, జీవిత చమరాంకంలో జీతంలో సగభాగమైనా పెన్షన్ కుటుంబ అవసరాలకు సరిపోక మరోవైపు అధికమవుతున్న వైద్య ఖర్చులతో పెన్షనర్లు నూతన పిఆర్‌సి, డిఎల ప్రకటన కోసం ఎదురు చూస్తున్న పరిస్థితి నెలకొందన్నారు. ఫ్యాప్టో రాష్ట్ర నేతలు గంటామోహన్, జివి రమణలు మాట్లాడుతూ సిపిఎస్, జిపిఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానంను పునరుద్దరించాలని, 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం మోమె నెం.57 ద్వారా పాత పెన్షన్ విధానంను వర్తింపచేయాలన్నారు. అలాగే కొత్తగా వున్న మూడు పెండింగ్ డిఎలను విడుదల చేయాలని, 11వ పిఆర్‌సి బకాయిలు, సరెండర్ లీవు బకాయిలను, రిటైర్డ్‌మెంట్ ప్రయోజనాలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో వున్న కారుణ్య నియామకాలను సత్వరం చేపట్టాలని కోరారు. ఆంగ్ల మాధ్యమంతో పాటు సమాంతరంగా తెలుగు మాధ్యమంను కొనసాగించాలన్నారు. గత పోరాటాల సందర్భంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన అనంతరం ఫ్యాప్టో నాయకులు జిల్లా రెవెన్యూ అధికారి మోహనకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.
ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ జి.మునీర్ రెహమాన్, ఛైర్మన్ బి.రామ్మూర్తి, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎన్ఆర్ మదన్మోహన్‌రెడ్డి, జి.ముక్తార్ అహ్మద్, ఎ.మునాఫ్, ఎం.సోమశేఖర్‌నాయుడు, బి.మోహన్‌యాదవ్, ఎం.కిరణ్‌కుమార్, లక్ష్మీపతిరెడ్డి, బర్కత్నా, జ్యోతిరామ్, సుధాకర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రెడ్డప్పనాయుడు, మునెప్పమెదలి, రెహెనాబేగం, యువరాజ్, ఎస్పీ భాషా, ప్రసన్నకుమార్, పార్థసారధి, హేమచంద్రారెడ్డి, పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పగడ్బందీగా భూముల రీసర్వే : హనుమంతు

చౌడేపల్లి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త



మండలంలోని లద్దిగం పంచాయతీకి సంబంధించిన భూముల రీసర్వేను పగడ్బందీగా చేపడుతున్నట్లు తహశీల్దార్ హనుమంతు అన్నారు. లద్దిగం రెవిన్యూ గ్రామంలో 1187ఎకరాల భూమి రీసర్వే చేయాల్సి వుండగా 950ఎకరాలు పూర్తి చేశామన్నారు. రైతులకు సంబంధించిన రికార్డులను ఈ సర్వే ద్వారా పూర్తిస్థాయిలో ఆధునీకరిస్తామన్నారు. భవిష్యత్తులో ఎలాంటి భూసమస్యలు లేకుండా రైతులు రీసర్వేలో సహకరించి చేయించుకోవాలన్నారు. సరిహద్దులు, రికార్డుల్లో వ్యత్యాసాలు వంటివి అప్రమత్తమై చూసుకోవాలన్నారు. అనంతరం రీసర్వే విధానాన్ని పర్యవేక్షించారు. మండల సర్వేయర్ గుణశేఖర్, రెవిన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఎండల పట్ల అప్రమత్తంగా వుండాలి : డాక్టర్ పవన్

చౌడేపల్లి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త



రోజు రోజుకూ పెరుగుతున్న ఎండల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని వైద్యాధికారి పవన్‌కుమార్ కోరారు. బుధవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపద్యంలో వ్యవసాయ, ఉపాధి కూలీలు పనులు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు అవసమైతేనే బయట తిరగాలన్నారు. వడదెబ్బకు గురైన వారిని వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రా నికి తరలించాలన్నారు. వేసవిలో జాగ్రత్తలు పాటించి ఆరోగ్యవంతంగా వుండాలన్నారు.

## కాంగ్రెస్‌పార్టీ నూతన మండల అధ్యక్షుల నియామకం

కుప్పం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త



కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, కుప్పం మున్సిపాలిటీకి సంబంధించి కాంగ్రెస్ పార్టీ నూతనంగా మండలాల అధ్యక్షులను నియమించింది. ఈమేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్, కుప్పం ఇన్‌చార్జ్ ఆవుల గోపిలు నూతన అధ్యక్షులకు నియామకపత్రాలు అందించారు. కుప్పం మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నిజామ్, శాంతిపురం అధ్యక్షుడిగా అబకలదొడ్డి నంజప్ప, రామకుప్పం అధ్యక్షుడిగా బగళనత్తం సుబ్రమణ్యం, గుడుపల్లె అధ్యక్షుడిగా నలగాంపల్లి కృష్ణప్ప గౌడు, కుప్పం మండల అధ్యక్షుడిగా నూలుకుంట మునస్వామిలు నియమితులయ్యారు

## కుప్పంలో తెలుగుతమ్ముళ్ల పనితీరుపై ఐవిఆర్ఎస్ సర్వే

కుప్పం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త

కుప్పంలో ఉన్న పలువురు తెలుగుదేశం పార్టీ నేతల పనితీరుకు సంబంధించి సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో పార్టీ అధిష్టానం ఇంట్రావాయిస్ రికార్డ్ సిస్టం(ఐవిఆర్ఎస్) సర్వేను నిర్వహిస్తోంది. ఫలానా నాయకుడు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారా లేదా, ప్రజలకు అందుబాటులో ఉంటున్నారా లేదా అని ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు సర్వే జరుగుతోంది. ఇప్పటికే పదవులు పొందిన కొందరు నేతల పనితీరుతో పాటు పదవులు ఆశిస్తున్న నాయకుల పనితీరుపై ఈ సర్వే నిర్వహిస్తున్నారు. ప్రజల అభిప్రాయాన్ని ఐవిఎస్ఆర్ సర్వేలో పూర్తిస్థాయిలో తీసుకున్నాక సిఎం చంద్రబాబునాయుడు ఆయా నేతలకు ప్రజలనుంచి వచ్చిన మద్దతును పరిగణనలో తీసుకుని పదవులు కట్టబెట్టే అవకాశాలు ఉన్నాయి.

## బధిర పాఠశాల విద్యార్థులకు అన్నదానం.. పుస్తకాల వితరణ

కుప్పం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త



కుప్పం టిడిపి మున్సిపల్ విభాగం కోశాధికారి, ఆర్యవైశ్య నాయకుడు గిరిధర్‌బాబు బుధవారం కుప్పం సమీపంలోని విక్టరీ బధిర పాఠశాల విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. తన తండ్రి మూడవ వర్ధంతి సందర్భంగా పిల్లలకు అన్నదానంతో పాటు ఉచితంగా నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. పిల్లలు బాగా చదువుకోవాలని ఆయన సూచించారు. బధిర పిల్లలకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు గోవిందరాజులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎర్రబ్యాడ్జీలతో ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

కుప్పం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త



ఎన్ఎంయుఎ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కుప్పం డిపోలో ఆర్టీసీ ఎన్ఎంయుఎ ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు వేలు, డిపో అధ్యక్షుడు మునస్వామి, డిపో కార్యదర్శి జయపాల్ మాట్లాడారు. ఉద్యోగులకు పనిభారం, అధికారుల ఒత్తిళ్లతో అనారోగ్యం పాలవడం లేదా పలువురు మృతి చె ందడం జరుగుతోందన్నారు. ప్రతి ఆర్నెల్లకు ఓసారి వైద్య పరీక్షలు జరపాలన్నారు. 1/2019 భద్రత సర్కులర్‌ను ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. లాంగ్ డిస్టేన్స్‌ప, రెండు రోజుల కంటిన్యూ డ్యూటీలకు నైట్ అలవెన్స్ రూ 400లు చెల్లించాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులు పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో డిపో ఛైర్మన్ బొట్టు మణి, వర్కింగ్ అధ్యక్షుడు ప్రసాద్‌కుమార్, జాయింట్ కార్యదర్శి మునెప్ప, నారాయణ, దిలీప్, రహంతుల్లా, జయశంకర్, అరుణ్, నారాయణ, రమణ, ఎల్లుస్వామి, చంద్రనాయక్, మణ్యం, ఉద్యోగులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ఆటిజం అవగాహన కార్యక్రమం

కల్లూరు, ఏప్రిల్ 2, ప్రభాతవార్త



ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం ప్రభుత్వం వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా బుధవారం పులిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ ఆటిజం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి పోకల తాతయ్య మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రభుత్వం అందించే వివిధ రకాల ప్రోత్సాహకాలను తల్లిదండ్రులు వినియోగం చేసుకోవాలని అన్నారు. ఐ ఈ ఆర్ టి లు వెంకటరమణ, బాలాజీ మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన ఉపకరాలను పిల్లల అభివృద్ధి కోసం ఉపయోగిస్తూ వారి అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఐ ఈ ఆర్ టి. బాలాజీ, సి అర్ పి వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్‌జిల్లాల యోగాఛాంపియన్‌షిప్ పోటీల్లో తేజశ్రీ ప్రతిభ

కుప్పంరూరల్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త



ఎపి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో నెల్లూరు నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల యోగా ఛాంపియన్‌షిప్ పోటీల్లో కుప్పం బాలికల హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న తేజశ్రీ ఉత్తమ ప్రతిభ కనబరచింది. అండర్ 14-17 విభాగంలో తేజశ్రీ పలు యోగాసనాలు ప్రదర్శించడంతో నిర్వాహకులు తేజశ్రీ ప్రతిభను గుర్తించి సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. ఈసందర్భంగా తేజశ్రీని హెచ్ఎం వెంకటేశ్వరబాబు, పిఇటి, ఉపాధ్యాయులు పుష్ప, సునీత తదితరులు అభినందించారు.

## అంగన్‌వాడీ కేంద్రం ఎదుట గుంత పూడ్చివేత

శాంతిపురం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త



స్థానిక ఆరిముత్తనపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం ఎదుట ప్రమాదకరంగా ఉన్న ఇంకుడు గు ంతను అధికారుల ఆదేశాలతో బుధవారం పూడి ్చవేశారు. బుధవారం 'వార్త'లో ప్రమాదకరంగా మారిన ఇంకుడు గుంత అనే వార్త రావడంతో ఎంపిడిఒ పిఆర్‌కుమార్ స్పందించారు. పంచాయతీ సర్పంచ్ ఎవి జయరాం, కార్యదర్శి అశ్వత్‌నారాయణలను వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో అంగన్‌వాడీ కేంద్ర ం ఎదురుగా ఉన్న మట్టి దిబ్బలు తొలగించి గుంతను పూడ్చేశారు. పిల్లల తల్లిదండ్రులు వార్తకు కృతజ్ఞతలు తెలిపారు.

## పూతలపట్టు తాసిల్దార్ విస్తృత తనిఖీ



పూతలపట్టు, ఏప్రిల్ 2, ప్రభాతవార్త
మండల కేంద్రంలో బుధవారం పుతులపట్టు బియ్యం గోడౌన్ విస్తృత తనిఖీ నిర్వహించారు. తాసిల్దార్ రమేష్ బాబు మాట్లాడుతూ డిటి పూజితను విచారించి బియ్యం చక్కెర కంది పప్పు సరుకులు సకాలంలో అందుతుందా లేదా అడిగి తెలుసుకున్నాడు. 2023-2024 సంవత్సరంసంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు.

## రేషన్ షాపు కోసం ఆందోళన

పాలసముద్రం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:

తమ గ్రామంలో రేషన్‌షాపు ఏర్పాటు చేయాలని మండలంలోని బొమ్మరాజుపురం ఆది ఆంధ్రవాడ ప్రజలు బుధవారం ఆందోళనకు దిగారు. గ్రామ సచివాలయం వద్ద జరిగిన ఈ ధర్నాలో రేషన్‌కార్డుదారులు మాట్లాడుతూ రేషన్ తీసుకోవడానికి తాము ప్రతి నెలా కష్టాలు ఎదుర్కొంటున్నామని వాపోయారు. తాము రేషన్ తీసుకోవాలంటే ప్రతి నెలా గ్రామం నుండి 3 కిమీ దూరం నడచివెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పనులు అన్ని చూసుకుని రేషన్ షాపు వద్దకు వెళితే డీలర్ అందుబాటులో వుండకపోవడంతో ఆ రోజు కూలీ పనులు పోతున్నాయన్నారు. ఈ క్రమంలో తమ గ్రామంలోనే రేషన్‌షాపు ఏర్పాటు చేసి తమ కష్టాలను తీర్చాలని రేషన్‌కార్డుదారులు అధికారులను కోరారు.

## మూడువేల కిలోల తమిళబియ్యం పట్టివేత .. ముగ్గురు అరెస్ట్

శాంతిపురం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త



తమిళనాడులో పేదలకు ఉచితంగా అందించే రేషన్ బియ్యాన్ని అక్రమంగా మినీటెంపో వాహనంలో కర్ణాటకకు తరలిస్తుండగా 3009కిలోల బియ్యం, వాహనంను స్వాధీనం చేసుకుని ముగ్గుర్ని అరెస్ట్ చేసినట్లు రూరల్ సిఐ మల్లేష్‌యాదవ్, రాళ్లబూదుగూరు ఎస్సై నరేష్ తెలిపారు. శాంతిపురం మండలం నడింపల్లికి చెందిన తులసిరాం (41), వి.కోట మండలం పట్రపల్లికి చెందిన కుశాల్‌కుమార్ (21)గుడుపల్లె మండలం యామనూరుకు చెందిన నాగేం ద్ర (21)లను అరెస్ట్ చేశామన్నారు. ఎపి39యుజె0531నెంబరు గల మినీ టెంపో వాహనంలో తమిళబియ్యంను కర్ణాటకలోని బంగారుపేటకు తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు.

## ప్రజల సంక్షేమం.. రాష్ట్ర అభివృద్ధికి సిఎం చంద్రబాబు కృషి

### - ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం



కుప్పం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త రాష్ట్ర అభివృ ద్ధితో పాటు ప్రజల సంక్షేమానికి సిఎం చంద్ర బాబునాయుడు కృషి చేస్తున్నారని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. బుధవా రం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేక రుల సమావేశంలో మాట్లాడారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో కుప్పంపై కక్షగట్టి అభివృద్ధి పనులు నిలిపేశారన్నారు. ఎక్కడికక్కడ ఆగిన అభివృద్ధి పనులను మరలా పట్టాలు ఎక్కించేందుకు సిఎం చంద్రబాబు విజన్ 2029తో కుప్పం అభివృద్ధికి చర్యలు చేపట్టారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వైకాపా పాలనలో జగన్ దివాళా తీయించారన్నారు. అయితే కూడా సిఎం చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన మాట మేరకు పెన్షన్ నగదు పెంచారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు వైకాపా ప్రభుత్వం పెట్టిన బకాయిలను సైతం ఇటీవలే ప్రభుత్వం చెల్లించిందన్నారు. కుప్పంలో ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా పైకి తేవాలని సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. అందుకు అనుగుణంగా తగు చర్యలు చేపడుతున్నారన్నారు. ఇప్పటికే గ్రామాల్లో సిసి రోడ్లు, రైతులకు గోకులం షెడ్లు మంజూరు చేయడంతో పాటు పనులు సైతం పూర్తయ్యాయన్నారు. కుప్పాన్ని ఓ ఆదర ్శ నియోజకవర్గంగా చేయడమే సిఎం చంద్రబాబు లక్ష్యం అన్నారు. అనంతరం శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయ కమిటీ సభ్యులుగా త్వరలో బాధ్యతలు చేపట్టనున్న కమిటీ సభ్యుల్ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సిఎం పిఎ మనోహర్, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, టిటిడి డైరెక్టర్ వైద్యం శాంతారాం, నేతలు ఆర్ముగం, ప్రతాప్,రవి, రామచంద్ర, వల్లెప్ప, సతీష్, మునెప్ప, బాలాజీ, మహిళా నేతలు భాగ్యలక్ష్మి త్రిలోక్, జయమ్మ, శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉండాలి

సదం, ఏప్రిల్ 2, ప్రభాతవార్త



ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీపీ మాధవిని పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. ఇటీవల నూతన ఎంపీపీగా ఎంపికయిన మాధవి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీపీని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి శాలువతో సన్మానించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆమెకు సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధనుంజయ రెడ్డి, పుట్రాజు, ఎల్లారెడ్డి, రమణారెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

## భూముల రీసర్వేకు రైతులు సహకరించాలి

రామకుప్పం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త

మండలంలోని పాముబోయనపల్లి, కెంచనబళ్ల రెవెన్యూ గ్రామాల పరిధిలో రీసర్వేకు రైతులు సహకరించాలని ఉప తహశీల్దార్ బాలాజీ కోరారు. బుధవారం ఆయన రీసర్వేపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో మరలా రీసర్వే చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో జరిగిన భూసర్వేలో చోటు చేసుకున్న తప్పిదాలు సరిదిద్దేందుకు ఈసర్వే జరుగుతుందన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రీసర్వే సమయంలో పాసు పుస్తకాలు, రికార్డులు తప్పక తేవాలని సూచించారు. కార్యక్రమంలో నేతలు మునిరెడ్డి, చంద్రారెడ్డి, పెరుమాళ్, ఆనందప్ప, మురళీమోహన్, కాశిరెడ్డి, సుబ్రమణ్యం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## సత్వరం రోడ్డు పనులు పూర్తి

### 'వార్త'కు స్పందన - పనులను పరిశీలించిన కలెక్టర్ సుమిత్‌కుమార్

యాదమరి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:



యాదమరి మండలం చిత్తూరు-గుడియాత్తం రోడ్డులో కాశిరాళ్ళ గ్రామం నుండి పరదరామి వరకు జరుగుతున్న రోడ్డు పనులను బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనులను సత్వరం చేపట్టి పూర్తి చేయాలని కాంట్రాక్టర్, ఆర్అండ్‌బి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. 'కలెక్టర్ చెప్పిందేంటీ! క్షేత్ర స్థాయిలో జరుగుతున్నదేంటీ! అనే శీర్షికతో సోమవారం 'ప్రభాతవార్త'లో వార్త ప్రచురితం అయిన విషయం తెలిసిందే. ఈ వార్తకు స్పందించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం క్షేత్ర స్థాయిలో రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించి సత్వరం పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆర్అండ్‌బి అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

## రామకుప్పంలో ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రం ప్రారంభం

రామకుప్పం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త



స్థానిక శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయ కమిటీ అధ్వర్యంలో ప్రజలకు ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి ప్రారంభించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలకు ఇబ్బంది కలగకుండా చల్లటి పానీయాలు అందించేందుకు ఆలయ కమిటీ చర్యలు చేపట్టడం పట్ల ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పివి సీతాపతి, బాలరాజు, సుబ్రమణ్యం, రామచంద్రప్ప పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ చిన్నారుల్లో లోప పోషణ తగ్గించాలి

.శ్రీకాళహస్తిరూరల్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త



అంగన్‌వాడీ చిన్నారుల్లో లోపపోషణ తగ్గించాలని ప్రాజెక్టు డైరెక్టర్ వసంతబాయి అన్నారు. బుధవారం జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వసంతబాయి శ్రీకాళహస్తి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని రాచగున్నేరి గ్రామ పంచాయతీ మరియు ఊరందూరు గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీకేంద్రాలను ఆమె సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు వారి ఎత్తు బరువులు చూసి పోషణ స్థితిని గుర్తించారు. పోషకాహారాన్ని పరిశీలించి తల్లిదండ్రులతో ఐసిడిఎస్ సేవలు గురించి అడిగి తెలుసుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అందించే పధకాలు అన్ని గర్భవతులు, బాలింతలకుతప్పక చేరాలని ఆమె ఆదేశించారు. అలాగే చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పధకాలను అంగన్‌వాడీ టీచర్లు బాధ్యతగా పనిచేసి వారికి అందించాలన్నారు. అనంతరం చిల్డ్రన్స్‌హోం బాలసదన్‌ను సందర్శించి అక్కడ కార్యక్రమాలు సేవలను పరిశీలించారు. కార్యక్రమంలోసిడిపిఓ శాంతిదుర్గ పలువరు అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## భవిత కేంద్రంలో ర్యాలీ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త



స్థానిక భవిత కేంద్రంలో బుధవారం ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎంఈఓ 2 బాలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటిజం అనేది జన్యుపరమైన కారణాల వల్ల సంభవిస్తుందని గర్భస్థ సమయంలో తీవ్ర ఒత్తిడిలో నవ్వడం, పౌష్టిహారం తీసుకోకపోవడం కూడా ఓకారణమే అన్నారు. నెలలు నిండకుండాలనే బిడ్డ జన్మించడం కూడా ఓకారణం అవుతుందని పిల్లలు పుట్టిన తర్వాత కూడా పిల్లల్లో తల్లిదండ్రులు సరైన సమయాన్ని గడపలేకపోవడం వల్ల కూడా ఈ ఆర్జిజం అనే డిసెబిలిటీ వస్తుందని ఎంఈవో తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న భవితకేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సుకన్య, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాల పిల్లలకు ఆటిజంపై అవగాహన

తొట్టంబేడు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త

మండలంలోని బసవయ్యపాళెం గ్రామం ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు భవిత కేంద్రనందు ఆటిజంపై అవగాహన కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారుల ఆధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి విద్యాశాఖ అధికారులు ఈవైకల్యం జన్యుపరమైనటువంటి లోపానికి సంబందించినదని ఈలక్షణాలు ఉన్న పిల్లల్లో శిక్షణా కార్యక్రమం అనేది చిన్నారులకు తక్కువ వయస్సు కలిగి ఉన్నపుడే గుర్తించినట్లయితే పిల్లలు యొక్క మానిసక పరిపక్వతఅనేది త్వరగా మెరుగు పరచడానికి అవకాశం ఏర్పడుతుందని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంతేకాకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసినటువంటి భవిత కేంద్రాల్లో అనేక రకాలైన వైకల్యాలకు శిక్షణ కార్యక్రమాలు రూపొందించి వారికి ప్రత్యేక సహిత ఉపాధ్యాయులును ఏర్పాటు చేసి వారి ద్వారా వైకల్యాన్ని మెరుగుపరచేందుకు ప్రభుత్వం ఎంతగానే దివ్యాంగులపట్ల చొరవచూపుతోందని కావున ప్రతి ఒక్క దివ్యాంగ విద్యార్థి తల్లిదండ్రులు భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు భారతీ, భాస్కర్ ఐఈఆర్‌టి ఉపాధ్యాయులు చైతన్య, నాగరాజు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పన్నులు ఫోన్‌పే..గూగుల్‌పే చేయాలనివచ్చే కాల్స్‌ను నమ్మవద్దు

*కుప్పం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త* కుప్పం మున్సిపల్ పరిధిలో ట్రేడ్ లైసెన్సులు లేదా ఇతర పన్నులకు సంబంధించి ఫోన్‌పే, గూగుల్‌పేలో నగదు పంపాలని వస్తున్న ఫోన్‌కాల్స్‌ను నమ్మరాదని మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు తెలిపారు. కుప్పం పురపాలక సంఘం వారి పేరిట ఫోన్‌పే, గూగుల్‌పేలో ట్రేడ్ లైసెన్సుల రుసుం చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయన్నారు. సదరు ఈ ఫోన్‌కాల్స్‌ను ప్రజలు ఎవరూ స్పందించరాదని ఆయన కోరారు. తమ పురపాలక సిబ్బంది ఎవరూ పన్నుల రుసుంను ఫోన్‌పే లేదా గూగుల్‌పేలో పంపాలని ఫోన్లు చేయడం లేదన్నారు. పురపాలక కార్యాలయంకు సంబంధించిన పన్నులు చెల్లించమని ఫోన్లు వస్తే నేరుగా పురపాలక కౌంటర్‌లో మాత్రమే నగదు చెల్లించి తగు రసీదు పొందాలని ఆయన కోరారు. ప్రజలు తప్పుడు ఫోన్‌కాల్స్‌తో మోసపోరాదని సూచించారు.



## ఆటిజమ్ అవగాహన దినోత్సవం

తిరుపతిరూరల్, ఎప్రిల్02 ప్రభాతవార్త:
తిరుపతిరూరల్ మండలంలో ఆటిజమ్ అవగాహన దినోత్సవాన్ని భవిత కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఆటిజమ్ గురించి సమాజంలో అవగాహన కల్పించారు. ఎంఇఒ శంకరయ్య ఆటిజమ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరఫిస్టు సరళకుమారి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



## ఆటిజం పిల్లలకు భరోసా అవసరం

తిరుపతి,ఏప్రిల్ 2ప్రభాతవార్త:



చిన్నతనంలోనే కనిపించే నరాల బలహీనత సమస్య, జీవితాంతం దాని ప్రభావంతో బాధపడుతున్న ఆటిజం పిల్లలకు కుటుంబసభ్యులు, సంబంధిత కేంద్రం భరోసానిస్తే మెరుగైన భవిష్యత్తు కల్పించవచ్చని ఆశ్రిత కేంద్ర వ్యవస్థాపకులు డాక్టర్ కవిత, డాక్టర్ భారతి తెలిపారు. బుధవారం పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం బిఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ విద్యార్థినులు, ఆశ్రిత చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుర్గజ్యోతి, పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బేబీ ప్రసూన,రాష్ట్రీయ సేవాసమితి ప్రిన్సిపల్ డాక్టర్ నందిని ఆటిజం పిల్లల వ్యవహారం, ప్రవర్తన, వారికి అందించాల్సిన చికిత్స విదానం, విద్య, తల్లిదండ్రుల పాత్ర,బాధ్యతలను వివరించారు. సమాజంలో కల్పించాల్సిన అవగాహన ప్రాధాన్యతను ,ఆటిజం పిల్లలకు భరోసా,స్వతంత్రంగా జీవించడం వాటిపై సూచనలు చేశారు.

## 4న ఊరందూరు సవారి ఉత్సవం

**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 2 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తీశ్వరఆలయం సారథ్యంలో ఈ నెల 4న ఊరందూరుకు సవారి ఉత్సవం నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నట్లు ఇఓ టి.బాపిరెడ్డి బుధవారం తెలిపారు. అనుబంధ ఆలయాల్లో ఉత్సవాలకు అత్యంత ప్రాధాన్యత కల్పించాలని స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సూచనలతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఇఓ తెలిపారు.ఈ నేపథ్యంలో విశ్వావసు నామ సంవత్సరం చైత్రమాసం,శుక్రవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఏడాదిలో ఒక సారి స్వామి అమ్మవార్లు ఊరందూరులోని నీలకంఠేశ్వర స్వామి ఆలయానికి చేరుకొని అక్కడ కొలువుదీరి పూజలు,అభిషేకాలు అందుకుంటారని వివరించారు.ఈ మేరకు చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య ఏర్పాట్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆ రోజు శ్రీకాళహస్తిలోని పానగల్,పెంకుల పాడు,విశాలాక్షమ్మ నగర్ వాసులకు పండగ. సాయంత్రం తిరుగుపయనంలో పానగల్లు,అగ్రహారం,సన్నిధివీధిల గుండా ఆలయానికి చేరి తరువాత రాత్రి గ్రామోత్సవం నిర్వహించుటకు నిర్ణయించినట్లు ఇఓ బాపిరెడ్డి వివరించారు.

## తీరుమారని భజంత్రీలు, స్వీపర్లు

సస్పెండ్‌కు సన్నాహాలు

**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 2 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే అతిధులను చుట్టుముట్టి చేయి సాచే కొందరిని సస్పెండ్ చేయటానికి ఆలయాధికారి నిర్ణయించినట్లు సమాచారం.వివరాలు పరిశీలిస్తే బుధవారం తెలంగాణకు చెందిన ఓ మహిళా కలెక్టర్ స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చారు. ప్రొటోకాల్‌గా సుబ్రమణ్యం(ఇన్సెపెక్టర్) ఉన్నారు. ఆయన కలెక్టర్‌ను దర్శనానికి తీసుకెళ్ళారు. తిరుగుపయనంలో కలెక్టర్‌ను ఓ వైపు భజంత్రీలు, మరో వైపు స్వీపర్లు చుట్టుముట్టి 'దక్షిణ' కోసంయాచించినట్లు దాంతో విసుగు చెందిన జిల్లా కలెక్టర్ సరాసరి ఆలయ కార్యనిర్వాహణాధికారే ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దాంతో భజంత్రీలు ఇవో వద్దకు వెళ్ళి యథాప్రకారం వేడుకున్నట్లు తెలిసింది. దాంతో ఇఓ బాపిరెడ్డి తాను ఎన్నో సార్లు హెచ్చరించానని, కానీ మార్పు రాలేదని స్పష్టం చేసినట్లు సమాచారం. దాంతో ఇఓ విధి నిర్వహణలో ఉన్న టెంపుల్ ఇన్సెపెక్టర్ సుబ్రమణ్యంను వివరణ కోరినట్లు సమాచారం. దాంతో సిసి కెమెరాలను పరిశీలిస్తున్నారు. మరి ఎంతమంది మీద వేటు పడుతుందో వేచి చూడాలి.

## 4న పెన్షనర్ల దినోత్సవం

**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 2 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తిలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో ఈ నెల 4 పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నారని అధ్యక్షులు బూడివాకం వెంకయ్య బుధవారం మీడియాకు తెలిపారు. సమాజ సేవలో 25 మంది రిటైర్డ్ ఉద్యోగులకు సన్మాన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. రిటైర్డ్ అయిన 15 సంవత్సరాలు నిండిన వారిని సత్కరించే సంప్రదాయం శ్రీకాళహస్తి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం తీసుకుకుందన్నారు.ఈ సన్మాన కార్యక్రమాలకు స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి రాష్ట్ర స్థాయి యూనియన్ నాయకులు హాజరౌతారని వివరించారు.

## ఇంటి పట్టాల కోసం 22 రోజులు దాటిన రిలే నిరాహారదీక్ష

**బుచ్చినాయుడు కండ్రిగ, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:**



ఇంటి పట్టాల కోసం కనమనంబేడు గ్రామం దళితులు సీపీఐ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్ష నేటికీ 22 రోజులు పూర్తయిందని కానీ అధికారులు పట్టించుకోవడం బాధాకరంగా ఉందని సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య వాపోయారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ ఇంటిస్థలాల కోసం రిలే నిరాహారదీక్షలు చేస్తున్నా రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం బాధాకరమని, గూడు కోసం ఇంటి స్థలాలు కేటాయించాలని రిలే నిరాహారదీక్షలు చేస్తుంటే అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తూ నడుచుకోవడం బాధాకరమన్నారు. ఇంటి పట్టాలు మంజూరు చేసే వరకు రిలే నిరాహారదీక్ష కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కనమనంబేడు గ్రామం దళితులు

## వెలుగు సమాఖ్యచే మహిళలు ఆర్థిక ఉత్పత్తి కేంద్రాలుగా ఎదగాలి

**బుచ్చినాయుడు కండ్రిగ, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:**



వెలుగు సమైక్యలోని మహిళలు పరిశ్రమలు స్థాపించి ఆర్థిక ఉత్పత్తిని సృష్టించి అభివృద్ధి వైపు నడవాలని ఏపీఎం మునెయ్య శిక్షణ కార్యక్రమంలో వివరించారు. బుధవారం వెలుగు కార్యాలయంలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాలు వార్షిక రుణ, జీవనోపాధుల ప్రణాళిక తయారు చేయడంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో కూడా వారు తీసుకునే రుణాలు వివిధ జీవనోపాధులు చేపట్టి వ్యాపారవేత్తగా ఆ కుటుంబంలో అదనపు ఆదాయం సంపాదించడమే కాకుండా ప్రభుత్వం అందిస్తున్న పథకాలు కూడా ఉపయోగించుకుని పారిశ్రామిక వేత్తలుగా తయారై మీతో పాటు అనేక మందికి ఉపాధి కల్పించాలని తెలియజేశారు. శిక్షణ అనంతరం గ్రామ సంఘం ప్రత్యేక సమావేశం నిర్వహించి తదుపరి సంఘం వారీగా సమావేశం ఏర్పాటు చేసి వారి ప్రణాళికను ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు.ఈ శిక్షణ కార్యక్రమంలో సీసీలు వెంకటరత్నం, వీరజిన్నప్ప, అకౌంటెంట్ హిమగిరిజ, మండల సమాఖ్య లీడర్లు, గ్రామ సంఘం అసిస్టెంట్లు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలపై గ్రామస్తులకు అవగాహన

**తొట్టంబేడు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి-నాయుడుపేట హైవేలో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు డిఎస్పీ నరసింహమూర్తి, తొట్టంబేడు సిఐ తిమ్మయ్యల ఆదేశాలతో ఎస్ఐ ఈశ్వరయ్య హైవేరోడ్డు పక్కనే ఉన్న లింగమనాయుడుపల్లి గ్రామానికి చేరుకుని గ్రామస్తులకు పలుసూచనలు, సలహాలు ఇచ్చారు. హైవేలో ప్రయాణించేటపుడు జాగ్రత్తగా ఉండాలని ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం పెట్టుకోవాలని కోరారు. వాహనాలను అధిక వేగంతో నడిపి ప్రాణాలు పోగొట్టుకోరాదని అయితే హైవేలో రాంగ్‌రూట్‌లో వెళ్ళకుండా రోడ్డు నిబంధనలను అనుసరించి ప్రాణాలు కాపాడుకోవాలన్నారు.రాంగ్‌రూట్‌లో వచ్చే వారికి ఎస్పీ ఆదేశాల మేరకు జరిమానా విధించడంతో పాటు వాహనాలను సీజ్‌చేస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు తమ కుటుంబాలను గుర్తుపెట్టుకుని ప్రయాణించాలన్నారు. హైవే మార్గంలో ఏఏ గ్రామాలు ఎక్కడెక్కడ ఉన్నాయో కూడా హైవే పనులు చేసిన వారితో చెప్పి బోర్డులు ఏర్పాటు చేయిస్తామని అంతేకాకుండా స్పీడ్ బ్రేకర్లు కనిపించే విధంగా వాటికి స్టిక్కరింగ్ ఏర్పాటు చేస్తామని ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు. ఎస్పీ ఆదేశాలను అనుసరించడంతో ఇప్పటికే ప్రమాదాలు 10 నుంచి 15శాతం వరకు తగ్గాయని హైవేలో నిత్యం పోలీసుల నిఘా ఏర్పాటు చేశామన్నారు. అవగాహన సదస్సులో లింగమనాయుడుపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

## యువతకు క్రికెట్ కిట్టు పంపిణీ

**తొట్టంబేడు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త**



గ్రామాల్లో క్రీడాకారులకు కొదువలేదని వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని మండల యువత నాయకుడు కె.భరత్‌రెడ్డి అన్నారు. గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహంగా మంగళవారం తొట్టంబేడు యువతకు భరత్ యువసేన సభ్యుల ద్వారా యువతకు క్రికెట్‌కిట్లు పంపిణీచేశారు. మండలంలో అనేక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా ఉంటున్న కె.భరత్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా భరత్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో యువతలో నైపుణ్యను వెలికి తీసే విధంగా ఉపాధ్యాయుఉలు కృషిచేయాలని క్రీడలు మానసికోల్లాసాన్నిస్తాయని తెలిపారు. మండలంలో ఏసమస్య వచ్చినా తానున్నానంటూ పేర్కొంటున్న భరత్‌రెడ్డికి యువత ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో భరత్ యువసేన సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ముసుగులో...పక్కాభవన నిర్మాణం

**తొట్టంబేడు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:**



శ్రీకాహస్తి-నాయుడుపేటరోడ్డు ఈటిసి కేంద్రం సమీపంలో బసవయ్యపాళెంకు వెళ్ళేదారిలో కొద్దిరోజుల పాటు ఓ చలివేంద్రం ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఈ చలివేంద్రం ముందు పాత పాల శీతలపానీయాల కేంద్రం కూడా ఉంది. ముందు శ్రీకాళహస్తి రెవెన్యూకు చెందినా, వెనుకవైపు మాత్రం తొట్టంబేడు మండలానిదే వస్తుంది. చలివేంద్రం ముసుగులో ఎంచక్కా పక్కా భవనాన్ని నిర్మించేస్తున్నారు. అయితే ఈవిషయమై ఈ స్థలం ఎవరిది ఎందుకు చలివేంద్రం ఏర్పాటు చేశారో, దశలవారీగా బయటపడనుంది. తహశీల్దార్‌లు మాత్రం కేవలం కార్యాలయానికే పరిమితమై పోవడంతో ఆక్రమణలకు అడ్డుకట్టగా మారింది. ఇటీవల ఓ విలేకరి పిడిఎఫ్ పత్రిల్లో వచ్చే వార్తలను పట్టించుకోకండి, మేమున్నాం అంటూ పోన్‌లో భరోసా ఇచ్చినట్లు సమాచారం. బసవయ్యపాళెం సమీపంలో రోడ్డు ముందు శ్రీకాళహస్తి రెవెన్యూ వస్తుంది. కొద్ది దూరంలో తొట్టంబేడు రెవెన్యూ వస్తుంది సర్వేనంబర్ 115లో ఉన్న స్థలం పక్కనే ఆరులైన్ల రోడ్డు వస్తుంది. ఈనేపథ్యంలో కొందరు అక్రమార్కులు, పాత్రికేయులు కళ్ళు పడ్డాయి. ఈ స్థలాన్ని గుట్టుచప్పుడు కాకుండా తమపై చేసు కోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. కబ్జా చేస్తుంటే రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెగనట్లు వ్యవహిస్తుండడం బాధాకరం. నిరుపేదలకు సెంటు భూమి ఇవ్వాలంటే సవాలక్ష నిబంధనలు చెప్పే రెవెన్యూ అధికారులు, ఇప్పుడు మౌనం ఎందుకు వహించాల్సి వచ్చిందో తెలియడం లేదు. ఇకనైనా చలివేంద్రం ముసుగులో పక్కా భవన నిర్మాణాన్ని కూల్చివేయాలని కమ్యూనిస్టులు ధర్నాలు చేయడం గమనించదగ్గ విషయం. అయితే కొందరు పాత్రికేయులు పక్కా భవన నిర్మాణదారుల వద్దనుంచి లక్షలు దండుకున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.దీనిపై అధికారులు సమగ్ర విచారణ చేయాల్సిన అవసరం ఉంది.

## వడమాలపేటలో ఆధార్ కేంద్రం ఏర్పాటు

**వడమాలపేట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన వడమాలపేటలో నేటి నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. ఈ నెల 3వ తేదీ నుంచి 5 తేదీ వరకు స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిసర గ్రామాల్లో 0-6 వయసు గల పిల్లలతో పాటు, ఆధార్‌లో మార్పులు, చేర్పులకు సరైన ఆధారాలతో దరఖాస్తు అందజేయాలని తెలిపారు. ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రపంచ అటిజం వైకల్యంపై అవగాహన దినోత్సవం

**నింద్ర, ఏప్రెల్ 2 ప్రభాతవార్త :**



ప్రపంచ అటిజం వైకల్యంపై అవగాహన దినోత్సవం బుదవారం మండల కేంద్రంలో అటిజం దినోత్సవం ఘనంగా జరిగింది. మండల విద్యాశాఖాధికారి వసుమతిదేవి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏప్రెల్ 2వతేది ప్రపంచ అటిజంపైన అవగాహన దినోత్సవం జరుపుకోవడం ముఖ్య కారణం పిల్లలు చిన్నతనం నుండి అటిజం వ్యాధికి గురికాకుండా ఉండటానికి తల్లిదండ్రులకు అవగాహన వుండాలన్నారు.మండల విద్యాశాఖాధికారి 2 శ్రీధర్‌రాజు మాట్లాడుతూ అటిజం అనేది ఒక మానసిక స్థితి దీనిని మూగవ్యాధి అంటారు,అటిజం గల పిల్లలు మానసికంగా ఒంటరిగా చేసిన పనులు మరల మరల చేయడం వంటి లక్షణాలు కలిగి వుంటారని తెలిపారు.కార్యక్రమంలో రాజేష్,వెంకటేశులు,గిరి,వాసు,కేర్ టేకర్ గీత తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్య, క్రీడా నైపుణ్యం క్రమశిక్షణ లభిస్తుంది

**బుచ్చినాయుడు కండ్రిగ, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:**



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసన చేసే విద్యార్థులకు క్రమశిక్షణ నాణ్యమైన విద్యక్రీడా నైపుణ్యం ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తుందని ఎంఈవో సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం ప్రగతి మెట్లుగా క్రమశిక్షణ క్రీడానైపుణ్యం నాణ్యమైన విద్యను అందించడం ప్రభుత్వ పాఠశాలకే సాధ్యపడుతుందని ఎంఈవోలు రవీంద్రనాథ్, సుబ్రహ్మణ్యంలు ఇంటింటి ప్రచారంలో తల్లిదండ్రులకు తెలియజేశారు. బుధవారం బుచ్చినాయుడు కండ్రిగ మండల పరిధిలోని కనమనంబేడు గ్రామంలో ప్రైవేటు పాఠశాలకు వెళుతున్న విద్యార్థుల తల్లిదండ్రులైన గోయల్ బాబు రాంకి, సుజానే కొంత మంది తల్లిదండ్రులను కలసి ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న కొంత మంది తల్లిదండ్రులను ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలు, అందిస్తున్న విద్యాబోధన గురించి వివరిస్తూ తమపిల్లలని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు కె.రవీంద్రనాథ్, ఏ.ముని సుబ్రహ్మణ్యం, కనమనంబేడు ఉపాధ్యాయులు కల్యాణి, సురేష్ పాల్గొన్నారు.

## మహిళా వర్సిటీలో ఘనంగా ఆటిజం దినోత్సవం

**తిరుపతి విద్య, ఏప్రిల్ 2 ప్రభాతవార్త**



పద్మావతి మహిళా వర్సిటీలో ప్రపంచ ఆటిజం దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఈడీ విద్యార్థినులకు బుధవారం వర్సిటీలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ఆశ్రిత చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్ వ్యవస్థాపకులు డాక్టర్ కవిత,డాక్టర్ భారతి అతిథులుగా హాజరయ్యారు.ఆటిజం చిన్నతనంలోనే కనిపించే నరాల బలహీనతకు సంభదించిన సమస్య అన్నారు.జన్యుపరమైన మార్పులు,మానసిక, శారీరకలోపాలు కారణాలుగా చెప్పవచ్చన్నారు.దీని ప్రభావం జీవితాతం ఉంటుందని,ఆటిజంకు పూర్తి స్థాయిలో నయం అవడం అసంభవమన్నారు.ఆటిజంకు గురైన పిల్లలకు కొని మెలుకువులు, శిక్షణతో సమాజంలో స్వతంత్రంగా జీవించగలిగే ప్రయత్నం చేయవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రసూన,రాష్ట్రీయ సేవాసమితిప్రిన్సి పల్‌డాక్టర్‌నందిని,విద్యార్థులు,అధ్యాపకులు,ఆటిజం పిల్లలు,తల్లిదండ్రులు హాజరయ్యారు.

## ఘనంగా శ్రీ గగన్ పాఠశాల వార్షికోత్సవం

**తిరుపతి విద్య, ఏప్రిల్ 2 ప్రభాత వార్త**




శ్రీ గగన్ స్కూల్ 5వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు.స్థానిక మహతి ఆడిటోరియంలో బుధవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా వెటర్నరీ వర్సిటీ వైస్ ఛాన్సర్ ఎంవి రమణ,ఆంధ్రప్రదేశ్ ఉమెన్ ట్రైవ్ ఫౌండేషన్ రషీదా బేగం,పాఠశాల కరస్పాండెంట్ సురేంద్ర రెడ్డి విచ్చేశారు.ఎంవి రమణ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి మంచి విజయాలు సాధించాలని సూచించారు.ఎంతోమంది విద్యార్థులను శ్రీ గగన్ పాఠశాల ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దింది అని అన్నారు. రషీథాబేగం మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులకు మంచిపేరు తెచ్చిపెట్టే విధంగా నడవడిక ఉండాలన్నారు.మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు.ఈ కార్యక్రమం ద్వారా దేశభక్తి,దైవభక్తి, గురుభక్తి,తల్లితండ్రులపై భక్తి,సత్ ప్రవర్తనలపైన నృత్య రూపకంలో, నాటక రూపంలో ప్రేక్షకులను ఎంతగానో అలరారించాయి.ఈ కార్యక్రమంలో అపుస్మా యూనియన్ బృందం,ఉపాధ్యాయులు,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## భగవంతుని సేవకు చేరువచేసేది ఆగమశాస్త్రమే

**తిరుపతి విద్య ఏప్రిల్ 2 ప్రభాత వార్త**

అర్చకులను భగవంతుని సేవకు చేరువ చేసేది ఆగమశాస్త్రమేనని ఎన్ఎస్ యు ప్రొఫెసర్ సి రంగనాథన్ పేర్కొన్నారు. ఎస్వీ వేదిక్ వర్సిటీలో వైఖానస,పాంచరాత్ర, శైవాగమంల ఆధ్వర్యంలో గత 21 రోజులుగా వర్సిటీలో జరిగిన అంతర్జాతీయ సిద్ధాంత కార్యాశాల బుధవారం ఘనంగా ముగిసింది.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ఆగమశాస్త్రంలోని రహస్యాలను తెలుసుకోవాలంటే వర్క్ షాపు లు ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు.దైవారాధన క్రియలలో లోతైన జ్ఞానాన్ని పొందడం వల్ల లోకానికి మంచి జరుగుతుందన్నారు. శ్రీకాళహస్తి ప్రధాన అర్చకులు పరశురామ గురుకుల్ శివ అద్వైతం, అర్చన ప్రక్రియలో సిద్ధాంత స్వరూపం గురించి వివరించారు. అనంతరం వీసీ రాణి సదాశివమూర్తి వర్క్ షాపు ప్రాధాన్యతను తెలియజేశారు.ఈ కార్యమంలో రిజిస్ట్రార్ భాస్కరుడు,డీన్ రాజేష్ కుమార్,సహసంచాలకులు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ భరత్ శేఖరాచార్యులు,డాక్టర్ కార్తికేయన్,డాక్టర్ టి బ్రహ్మాచార్యులు,అధ్యాపకులు,పండితులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పడవేటమ్మ ఆలయంలో హుండీ చోరీ

**విజయపురం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:**

మండలంలోని ఎల్లసముద్రంలో పడవేటమ్మ మంగళవారం అర్ధరాత్రి హుండీ చోరీకి గురైందని గ్రామస్తులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని ఏఎస్ఐ గోవిందరాజు, సిబ్బంది పరిశీలించారు. హుండీ చోరీ విషయమై పలువురిని విచారణ నిర్వహించారు. నిందితులను పట్టుకోవడానికి నిఘా ఉంచుతామన్నారు.

## శివయ్యసేవలో సంగీత దర్శకులు కోటి

**శ్రీకాళహస్తితో అనుబంధం**

**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 2 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తిలో వెలసిన పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో తమకు విడదీయరాని అనుబంధం ఉందని ప్రముఖ సంగీత దర్శకులు కోటి అన్నారు. బుధవారం ఆయన శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చారు.వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ప్రొటోకాల్ ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి సారథ్యంలో పిఆర్ఒ రవి వేదపండితులతో స్వాగతం పలికారు.ఈ సందర్బంగా కోటి మట్లాడుతూ తమకు ఆలయంలో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. తాము పలుమార్లు ఇక్కడ శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను అందించామన్నారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం తరువాత వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు.

## బండారు పల్లికి బస్సు:ప్రయాణీకుల హర్షం

**శ్రీకాళహస్తిరూరల్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త**



ఏర్పేడు మండలం బండారుపల్లి గ్రామానికి వయా సుబ్బానాయుడు కండ్రిగ,తొండమనాడు బస్సును ఏర్పాటు చేసారు.ఈ బస్సును బుధవారం ఆర్‌టిసి అధికారులు ప్రారంభించారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా తెలుగుదేశం నాయకుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి బండారుపల్లి, సుబ్బానాయుడు కండ్రిగలకు వెళ్ళినపుడు ప్రజలు తమకు శ్రీకాళహస్తి నుంచి బస్సు సౌకర్యం లేక తిప్పలు పడుతున్నామని వివరించారు.బస్సును ప్రారంభించిన ఆర్‌టిసి అధికారులు ప్రతి రోజూ ఏడు ట్రిప్పులు బస్సును నడుపుతామని వివరించారు.బస్సు కోసం ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్‌ల కృషితో తమ గ్రామానికి బస్సు సదుపాయం కల్గిందని వివరించారు.ఈ ప్రారంభోత్సవంలో ఏర్పేడు మండల బిజెపి యువమోర్చా అధ్యక్షులు చెంచురెడ్డి పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## సీఎం చంద్రబాబుని కలసిన కేవీబీ పురం టీడీపీ నేతలు

**కేవీబీ పురం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:**



సీఎం చంద్రబాబును కేవీబీ పురం మండల టీడీపీ సీనియర్ నేతలు, రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామి యాదవ్, సర్పంచ్ దొరబాబునాయుడులు విజయవాడ ఎయిర్‌పోర్టులో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం మండలంలోని కొన్ని సమస్యలను పరిష్కరించాలని, అలాగే గత ప్రభుత్వంలో టీడీపీ నాయకులపై, కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేయాలని, నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి పార్టీకి సంబంధించి కమిటీ సర్వే చేస్తుందని పార్టీ కోసం కష్టపడి వారికి కచ్చితంగా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

## పుత్తూరులో ప్రపంచ అటిజమ్ అవగాహన ర్యాలీ

**పుత్తూరు రూరల్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:**



పుత్తూరు మండలంలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలు మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల భవిత కేంద్రంలో ప్రపంచ అటిజమ్ అవగాహన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారులు తిరుమలరాజు, బాలసుబ్రహ్మణ్యం, పుత్తూరు ప్రధాన పాఠశాల హెచ్ఎం మురళీకృష్ణలు పాల్గొన్నారు. అటిజమ్ అవగాహన దినోత్సవం సందర్భంగా ఎంఈవో తిరుమలరాజు మాట్లాడుతూ పిల్లల తల్లిదండ్రులను, పిల్లలను ఉద్దేశించి అటిజమ్ అనేది వ్యాధి కాదని అటిజమ్ ఉన్నప్పుడు వారిని తొందరగా చిన్న తనంలోనే గుర్తించి, తల్లిదండ్రులు వారిలో అభివృద్ధిని చూడవచ్చని, సమస్యను అధికమించవచ్చని తెలియజేశారు. ఇలాంటి విద్యార్థులను భవిత కేంద్రానికి తీసుకొచ్చి పిల్లలకు మెరుగైన సేవను అందించి వారి పనులను వారే చేసుకునే విధంగా చేయవచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థులతో పుత్తూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు స్వీట్లు, అరటి పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో పి.ఆనంద, వి.సూర్యకుమారి, స్పెషల్ టీచర్ జగదీశ్వరి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అంబులెన్సు విద్యార్థుల అత్యవసరాల కోసం వినియోగించాలి

**తిరుపతి విద్య, ఏప్రిల్ 2 ప్రభాత వార్త**



ఎస్వీ వర్సిటీలోని నూతన అంబులెన్సు విద్యార్థుల అత్యవసరాల కోసం వినియోగంలోకి తేవాలని జీఎన్ఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు శివశంకర్ నాయక్ డిమాండ్ చేశారు.ఈ మేరకు బుధవారం వీసీ సీహెచ్ అప్పారావుకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మట్లాడుతూ ఎస్వీయూ విద్యార్థుల,ఉద్యోగుల అత్యవసరాల కోసం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ. 30 లక్షల విలువగల నూతన అంబులెన్సు వర్సిటీకి అందించిందన్నారు. నూతన అంబులెన్స్ ను అందించి నాలుగు నెలలు అవుతున్నా దీనిని వర్సిటీ అధికారులు గోడౌన్లో మూలన పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన పత్రాలు లేని కాలం చెల్లిన అంబులెన్స్ ను మాత్రమే వర్సిటీ అధికారులు వినియోగించడం దారుణమన్నారు.గత వారంలో వర్సిటీలో ఉద్యోగి చనిపోతే మృతదేహాన్ని స్వస్థలానికి చేర్చేందుకు కాలం చెల్లిన వాహనంలో పంపడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో గిరిజన నవ సమాజ్ నాయకులు చంద్ర నాయక్,బాలు నాయక్,దిలీప్,వెంకటాద్రి,తదితరులు పాల్గొన్నారు.

## పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే వర్సిటీ లక్ష్యం

**తిరుపతి విద్య ఏప్రిల్ 2 ప్రభాత వార్త**



యువతను,ఔత్సాహికులను,రైతులను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే వెటర్నరీ వర్సిటీ లక్ష్యమని పరిశోధక,విస్తరణ సంచాలకులు డాక్టర్ శ్రీలత,డాక్టర్ శోభామణి పేర్కొన్నారు.ఎస్వీ వెటర్నరీ వర్సిటీ నిరంతర పశువైద్య విద్య,సమాచార కేంద్రం ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్ధతులలో సీమపందుల పెంపకం అనే అంశంపై మూడు రోజుల పాటు జరగనున్న శిక్షణా కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లాభసాటి పారిశ్రామిక రంగంలో పందుల పెంపకం ఒకటిగా చెప్పవచ్చన్నారు.శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను అనుసరించి ఫాము ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.పందుల పెంపకంతో నేడు ఎంతో మంది పారిశ్రామిక వేత్తలుగా రాణిస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రొగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ డాక్టర్ కే సుజాత,డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి,డాక్టర్ గంగరాజు,డాక్టర్ వెంకటేశ్వర్లు,డాక్టర్ మంజురి,తెలంగాణా, ఆంధ్ర నుంచి సుమారు 40 మంది రైతులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు,యువత పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కటకటాలే

ట్రైనీ ఐపిఎస్ హేమంత్

**రామచంద్రాపురం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:**

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కటకటాల పాలవుతారని ట్రైనీ ఐపిఎస్ హేమంత్ హెచ్చరించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మద్యం, గంజాయి వంటి వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యువత తల్లిదండ్రులు వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడిపితే రూ.10 వేలు జరిమానా విధిస్తామన్నారు. మండలంలో ఎక్కడైన అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లయితే స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు.

## రేకలచేనులో కొనసాగుతున్న పోలీసు పికెటింగ్

**రామచంద్రాపురం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:**

సోమవారం రాత్రి భూపతిరెడ్డిపై గుర్తు తెలియని దుండగులు దాడిచేసిన విషయం పాఠకులకు విధితమే. ఈ నేపథ్యంలో రేకలచేను గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా బుధవారం సైతం పోలీసు పికెటింగ్ కొనసాగించారు. గ్రామవీధుల్లో పోలీసు బలగాలు తిరుగుతూ ప్రజలు గుంపులుగా గుమికుండా చర్యలు తీసుకున్నారు. ఎటువంటి దుశ్చర్యలకు పాల్పడినా కేసులు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రవీంద్రనాథ్ హెచ్చరించారు.



## తిరుపతి వెళ్లి పింఛన్ అందజేత

**పాకాల, ఏప్రిల్ 2, ప్రభాతవార్త**

పాకాల మండలం దామల చెరువు పంచాయతీ జోగలావారిపల్లి చెందిన చెరుకూరి గోవిందమ్మ ఇటీవల తీవ్ర ఆనారోగ్య సమస్యతో తిరుపతి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పింఛన్‌కు గోవిందమ్మ అర్హురాలు కావడంతో మార్చి నెల పింఛన్ నగదు అందించేందుకు ఏపి ట్రాన్సకో ఉద్యోగి తేజ బుధవారం సాయంత్రం విధులు పూర్తి చేసుకొని 8.30కు తిరుపతి చేరుకొని లబ్ధిదారు గోవిందమ్మకు రూ.4000 నగదు అందజేశారు.

## గుండెపోటుతో డప్పు కళాకారుడు మృతి

**విజయపురం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:**

గుండెపోటుతో డప్పు కళాకారుడు చిరంజీవి(55) మృతి చెందిన సంఘటన మండలంలోని కళియంబాకం ఆది ఆంధ్రవాడలో బుధవారం జరిగింది. అందరితో కలుపుగోలుగా మాట్లాడుతూ కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఆరు బయట వెళ్లి ఇంటి చేరుకుని ఉందని చెబుతూ కుప్పకూలడాని గ్రామస్తులు తెలిపారు.

## వాక్సినేషన్ సెంటర్‌ని తనిఖీ చేసిన డీఐవో

**విజయపురం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:**



మండల కేంద్రమైన విజయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కోసలనగరం ఆరోగ్య ఉపకేంద్రాన్ని బుధవారం జిల్లా వాక్సినేషన్ అధికారి(డీఐవో) హనుమంతరావు తనిఖీ చేశారు. ఆడ బిడ్డ పుడుతుందని స్కాన్ చేసి అబార్షన్‌ను పాల్పడితే కేసులు తప్పవని హెచ్చరించారు. అబార్షన్ కేసులను పూర్తి స్థాయిలో సూపర్‌వైజర్లు పరిశీలించాలని కోరారు. వాక్సినేషన్‌లో కోల్డ్‌చైన్‌ను తప్పని సరిగా పాటించాలని కోరారు. పబ్లిక్ హెల్త్ సెంటర్‌లో కంప్యూటర్, కరెంటు సదుపాయం ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి విష్ణుప్రియ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలు ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలి

**తిరుపతి కార్పొరేషన్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త**

ప్రజలు ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలని ట్రాఫిక్ డిఎస్పి రామకృష్ణచారి తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో పట్టుబడిన 17 మంది నిందితులకు ఒక్కొక్కరికి రూ.10,000ల చొప్పున మొత్తం రూ.1,70,000ల జరిమానా విధించారు. జిల్లా ఎస్పీ హరవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ట్రాఫిక్ డిఎస్పి రామకృష్ణచారి, ఇన్స్పెక్టర్లు సుబ్బా రెడ్డి, సంజీవ్ కుమార్ , భాస్కర్ నాయక్ కేసుల వివరాలు వెల్లడించారు. తిరుపతి పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపిన డ్రైవర్ల పై ట్రాఫిక్ పోలీసు వారు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసి 17 మంది ముద్దాయిలను 4వ అడిషనల్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు తిరుపతి నందు హాజరు పరచగా గౌరవ జడ్జి గ్రంధి శ్రీనివాస్ ఒక్కొక్కరికి 10,000 చొప్పున మొత్తం 17 మందికి 1,70,000 జరిమానా విధించారు.

# అపాచి పరిశ్రమను సందర్శించిన ఎమ్మెల్యే




తడ, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : తడ మండలం మాంబట్టు వద్దనున్న అపాచి షూ తయారీ కేంద్రాన్ని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ బుధవారం సందర్శించారు. పరిశ్రమ ఉత్పత్తుల గురించి ఆమె నేరుగా తెలుసుకున్నారు. అక్కడ క్యాంటీన్ నిర్వహణ వంటి అంశాల మీద దృష్టి పెట్టారు. ఈ సందర్భంగా పరిశ్రమ అధికారులు ఆమెకు స్వాగతం పలికి తమ అభివృద్ధి గురించి ఫొటో ప్రజంటేషన్ ఇచ్చారు. పరిశ్రమలో ఉద్యోగుల కోసం, వారి పిల్లల కోసం చేస్తున్న ఏర్పాట్లను, సామాజిక సేవా కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. ఆమె వెంట టిడిపి నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి కె.సెల్వం, టికెశ్రీనివాసన్, బొమ్మన్ ఏకాంబరం, వేలూరు చంద్రయ్య, వల్లం విజయమ్మ, వేనాటి రాజారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, మాధవనాయుడు, ఎజి కిషోర్, అలవల శ్రీనివాసులు, రవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల నూతనంగా ప్రారంభమైన ఒక రైస్‌మిల్లును కూడా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సందర్శించారు.

# గూడూరు డివిజన్

## అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం

కోట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : మండలం ఊనుగుంటపాలెం గ్రామంలో మల్లి గురవమ్మ అనే మహిళకు చెందిన పూరిల్లు బుధవారం అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ అగ్ని ప్రమాదం జరిగింది. కట్టుబట్టలతో తాము మిగిలామని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లో ఉన్న 4 సవర్ల బంగారం, 45 వేల రూపాయలు నగదు ఈ ఘటనలో కాలిపోయిందని బాధితురాలు గురువమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ మేరకు తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

## అవుట్ సోర్సింగ్ ఉద్యోగి మృతి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలోని షార్ కాలనీవాసులు నివసించే పులికాట్ నగర్‌లో అవుట్ సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న యద్దల నాగరాజు (41) అనే వ్యక్తి బుధవారం ప్రమాదవశాత్తు మృతిచెందాడు. సెప్టిక్ ట్యాంకును శుభ్రపరిచే ప్రక్రియలో భాగంగా లోపలికి దిగడంతో ప్రమాదవశాత్తు దుర్మరణం పాలయినట్లు స్థానికులు తెలిపారు. దావాదిగుంట గ్రామానికి చెందిన యద్దల నాగరాజు 15 సంవత్సరాలుగా పులికాట్ నగర్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నాగరాజు మృతితో దావాదిగుంట గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## నేటి నుండి అమీషావలి గంధ మహోత్సవం

నాయుడుపేట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : పట్టణంలోని దర్గా సెంటరులో వెలసియున్న అమీషావలి గంధమహోత్సవం గురువారం నుండి మూడురోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటిసభ్యులు తెలియజేశారు. ఏప్రిల్ 3వతేదిన గంధమహోత్సవం, 4పాటకచ్చేరి, 5నసాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం నిర్వహించడం జరుగుతుందన్నారు. నాయుడుపేట పట్టణం, చుటుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొని ఉరుసును జరుపుకోవాలని సూచించారు. నాయుడుపేటలో ఉరుసు సందర్భంగా పోలీసులు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రతిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సిఐ బాబి తెలిపారు.

## పెళ్ళకూరులో ఉచిత కంటివైద్య శిబిరం

నాయుడుపేట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : పెళ్ళకూరులో చాగణం లలితమ్మ భాస్కరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుపతి వెంకటేశ్వర అరవింద్ నేత్రాలయం సహకారంతో ఉచిత కంటివైద్య శిబిరం బుదవారం నిర్వహించారు. ఈశిబిరాన్ని ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌరిశంకర్ ప్రారంభించారు. ఈసందర్భంగా డైరెక్టర్ గౌరిశంకర్ మాట్లడుతూ ప్రతినెలలో సుమారు నాలుగు మండలాలోల ఉచిత కంటివైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 40 మండలాల్లో 35వేల మందికిపైగా వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ వైద్య శిబిరం ఉదయం నుండి మధ్యాహ్న 2గంటల వరకు నిర్వహించారు. కంటిలో సమస్యలు ఉన్నవారిని గుర్తించి తిరుపతి అరవింద్ నేత్రాలయంకు తరలించారు.

## మద్యం మత్తులో కూతుర్ని వదిలి వెళ్ళిన తండ్రి




వెంకటగిరి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : మద్యం మత్తులో కన్న కూతుర్ని వదిలి వెళ్ళిన సంఘటన వెంకటగిరి పట్టణంలో చోటుచేసుకుంది. సీఐ ఏవి రమణ కథనం ప్రకారం, బుచ్చిరెడ్డిపాలెంకు చెందిన ఏడుకొండలు బంధువులు వెంకటగిరిలో ఉండడంతో కూతురు ఎనిమిది సంవత్సరాల వయసు కలిగిన పెంచల నరసమ్మను తీసుకొని వచ్చాడు. అయితే ఏడుకొండలు పూర్తిగా మద్యం తాగి మత్తులో కన్న కూతుర్ని వదిలి వెళ్ళాడు. పక్కన కూతురు ఉంది అన్న విషయం కూడా మత్తులో ఏడుకొండలు గుర్తించలేకపోయాడు. అయితే సినిమా థియేటర్లో కూడలిలో టిఫిన్ దుకాణం నడుపుకుంటున్న వెంకటేశ్వర్లు ఏడుస్తున్న పాపను గుర్తించి పోలీసులకు అప్పగించారు. పోలీసులు అవ్వ తాతకు సమాచార ఇచ్చి వారిని రప్పించి అప్పగించారు. పాపను అప్పగించడంతో సిఐకి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

## నేటి నుండి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

బాలాయపల్లి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : మండలంలో ఈనెల మూడవ తేదీ నుండి నాలుగవ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో డీజే వినీల్ కుమార్ తెలిపారు. సచివాలయాల్లో ఆధార్ క్యాంపులో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలోని మూడవ తేదీ పిగిలాం, వెంగమాంబ పురం, నాలుగవ తేదీ కయ్యూరు, కామకూరు సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ కార్డు నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఉచిత సంతాన సాఫల్యత శిబిరం



గూడూరు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : పట్టణంలో ఏఆర్‌సి ఫెర్టిలిటీ వారి ఆధ్వర్యంలో బాలాజీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నందు ఉచిత సంతాన సాఫల్యత శిబిరం నిర్వహించారు. చుట్టు ప్రక్కల దాదాపు 20 గ్రామాల దంపతులు పాల్గొనగా డాక్టర్ బి.దివ్యశ్రీ ఆరోగ్య సూచనలు చేయడం జరిగింది. కొంతమంది రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు.

## ప్రవీణ్ మృతిపై క్రైస్తవ సంఘాలు సంతాపం



గూడూరు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : పాస్టర్ ప్రవీణ్ మృతి పట్ల క్రైస్తవ సంఘాలు సంతాపం తెలుపుతున్నాయి. ఆయన మృతి ఎలా జరిగిందనేది తేల్చాల్సిన అవసరం ఉందని సంఘ కాపరి రెవరెండ్ ఎం.ప్రవీణ్ రాజు, తదితరులు కోరుతున్నారు. ఈ క్రమంలో భాగంగా గూడూరు పట్టణంలో శాంతి ర్యాలీ జరిగింది. సంఘస్తులందరూ స్థానిక లూథరన్ చర్చి ప్రాంగణం నుండి మైథిలి ఆసుపత్రి మీదుగా గడియారం స్థంభం వరకు శాంతియుతంగా తమ నిరసన తెలిపారు. ఈ శాంతి ర్యాలీలో చైర్మన్ కె.రాజయ్య, ఐసిసి, పీసీసీ సభ్యులు పాల్గొన్నారు.

## ఆటిజంపై అవగాహన సదస్సు



గూడూరు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : మండల పరిధిలోని పాలిచెర్ల వారి పాళెం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆటిజంపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ మాట్లాడుతూ చిన్న తనంలోనే ఆటిజం లక్షణాలు గుర్తిస్తే నివారణ సులభమే అన్నారు. స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పి.సురేంద్ర ఆటిజం లక్షణాలు, పర్యవసానాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్ర, మంజు శ్రీ, మాధవయ్య, సుగుణ, మస్తాన్, కామేశ్వరి, ఆదిలక్ష్మి, నాగభూషణమ్మ, విద్యా కమిటీ సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

## వృద్ధులకు, పేదలకు అన్నదానం



గూడూరు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : పట్టణంలోని జనసేన పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి, ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు జన్మదిన సందర్భంగా ఓం సాయిరాం చారిటబుల్ ట్రస్ట్ ఆశ్రమంలో వృద్ధులకు, పేదలకు అన్నదానం అనంతరం జనసేన పార్టీని కార్యాలయంలో కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా గూడూరు నియోజకవర్గం పిఓసి కె.మోహన్ మాట్లాడుతూ జనసేన పార్టీ ఆవిర్భావం నుండి పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలకు కట్టుబడి కష్టపడుతున్నారని, మండల, గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగార్జున, ఉప్పు సాయి, వంశీ కృష్ణ, చిల్లకూరు మండలం ప్రధాన కార్యదర్శి మనోజ్ కుమార్, కార్తీక్, జన సైనికులు సనత్, రాకేష్, లతీఫ్, వసంత్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య!

వాకాడు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : శ్రీకాకుళం జిల్లాలోని కొత్తూరు మండలంలో వున్న జగన్నాధపురం గ్రామానికి చెందిన ఢిల్లీశ్వరరావు భార్య అమిర్తి జ్యోతి (38) తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన వారు. వారికి యశ్వంత్, కుమారుడు, చందన అనే కుమార్తె వున్నారు. అయితే భార్య భర్తలు ఇద్దరూ బేల్దారి కూలి పనులు చేసుకుని పిల్లల్ని చదివించుకుంటున్నారు. జ్యోతికి ఉన్న అనారోగ్య కారణం దృష్ట్యా ఆమె చనిపోవాలన్న ఉద్దేశంతో పురుగులు మందు తాగి ఇంట్లో ఉండగా గమనించిన ఆమె కుమారుడు చుట్టుపక్కల వారి సహాయంతో వాకాడు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి చేర్పించారు. ఆసుపత్రిలో ఆమె చికిత్స పొందుతూ మరణించిందని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం పిఎం చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు ఎస్ఐ నాగబాబు అప్పగించారు.

## మాలలు చైతన్యవంతులు కావాలి

వాకాడు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: సమాజ చైతన్య సమితి ఆధ్వర్యంలో మాలలకు జరుగుతున్న అన్యాయంపై ప్రజలకు చైతన్యం కల్పించారు. బుధవారం వాకాడు మండలం నెల్లిపూడి గ్రామంలో సమాజ చైతన్య సమితి బృందం మాలలుకు ఎస్సీ వర్గీకరణపై అవగాహన కల్పించారు. ఏపీ ఎన్జీవో ప్రెసిడెంట్, మాల ఉద్యోగస్తుల ఉమ్మడి నెల్లూరు జిల్లా అడిషనల్ జనరల్ సెక్రెటరీ టి.కృష్ణ మాట్లాడుతూ మాలలు అందరూ ఐక్యతగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రంగనాథ్, మణి, ప్రతాప్, సంతోష్, డాక్టర్ శ్రీనివాసులు, ఇంగిలాల పోలయ్య, సుబ్రహ్మణ్యం, చిరంజీవి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## తిరుమలలో ఆకాశ్ అంబానీ



తిరుమల, ఏప్రిల్ 2ప్రభాతవార్తప్రతినిధి: ధనవంతుడనే హంగు ఆర్భాటం అతనిలో కనబడలేదు..పైగా సామాన్య భక్తుడులాగే ఇష్టదైవం వేంకటేశ్వర స్వామి సన్నిధిలో ముఖేశ్‌అంబానీ కుమా రుడు ఆకాశ్ అంబానీ శ్రీవారిని దర్శించుకున్నారు. గోశాలలో గోమాతకు దాణాన్ని తినిపించారు. తనలోని సేవానిరతిని చాటుకున్నారు. ఆలయం వెలుపల ఆకాశ్‌ను చూడటానికి అభిమానులు ఉత్సాహం చూపారు.

## గ్రామస్థుల సమస్య పరిష్కారానికి శ్రీకారం



కోట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: కోట మండలం పుచ్చలపల్లి పంచాయతీలోని చీకల్లదిబ్బ గ్రామస్థుల సమస్యను పరిష్కరించేందుకు తహశీల్దార్ కె.జయ జయరావు శ్రీకారం చుట్టారు. ఇటీవల ఆ గ్రామస్థులు స్మశాన స్థలాన్ని, దారిని కొంతమంది రైతులు ఆక్రమించి రొయ్యల గుంటలు సాగు చేస్తున్నారని తహశీల్దార్‌కి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం తహశీల్దార్ జయజయరావు, మండల సర్వేయర్ గోపీనాథ్‌రెడ్డిలు ఆ గ్రామానికి వెళ్లారు. స్మశాన స్థలాన్ని ఎవరు ఆక్రమించారనే అంశంపై పరిశీలించారు. ఆ మేరకు గ్రామస్థులకు సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## ఆటిజంపై అవగాహన సదస్సు



సూళ్లూరుపేట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : పట్టణంలోని భవిత స్కూలులో ఆటిజం వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆటిజం రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటిని ఎలా నివారించాలనే అంశంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పోషకాహార లోపం వలన గర్భాధారణ సమయంలో ఎర్లీ ప్రెగ్నెన్సీ, జన్యు లోపాల వలన ఆటిజం కండిషన్ వస్తుందని సదస్సులో పాల్గొన్న వారు తెలిపారు. ఇటువంటి పిల్లలు ఉంటే వారికి సరయిన ఆహార నియమాలు, శిక్షణ ఇస్తే కోలుకునే అవకాశాలు ఉంటాయని చెప్పారు. అనంతరం దివ్యాంగ పిల్లలకు నృత్య ప్రదర్శనలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భవిత స్కూలు ఉపాధ్యాయురాలు విటి భార్గవి, ఎంఇఓ శ్రీనివాసులు, డాక్టర్ జయచంద్ర, సాయిసంధ్య, శ్రీనివాసులు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలలో వేసవి తరగతుల నిర్వహణ



బాలాయపల్లి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : వెంగమాంబపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమ్మర్ వెకేషన్ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈనెల 23 వరకు తరగతులు జరుగుతాయని కాంట్రాక్ట్ అధ్యాపకులు మునీంద్ర తెలిపారు. మరల జూన్ నుంచి తరగతులు పునః ప్రారంభమవుతాయని అన్నారు. జూనియర్ కళాశాలలో హెచ్ఈసి, సిఇసి, బైపీసీ గ్రూపులు ఉన్నాయన్నారు. వెంగమాంబ పురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమ్మర్ వెకేషన్ తరగతులు ప్రారంభమయ్యాయని కాంట్రాక్ట్ అధ్యాపకులు మునీంద్ర తెలిపారు. ఎంసెట్, నీట్ కోచింగ్, డిజిటల్ విద్య బోధన అందిస్తున్నట్లు అతిధి అధ్యాపకులు నవీన్ తెలిపారు. ఫోటో

## మెకోస్డియా గోడపత్రిక ఆవిష్కరణ



కోట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యం లో జాతీయ స్థాయి పేపర్ ప్రజంటేషన్ మెకోస్డియా 25కె పోస్టర్‌ను కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 25న ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. పేపర్ ప్రజంటేషన్, క్విజ్, ప్రదర్శనలు, ఇతర సాంకేతిక ఈవెంట్స్ ఉంటాయన్నారు. అనంతరం మెకానికల్ హెచ్ఓడి డాక్టర్ సిహెచ్ విక్రమ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శించాలని కోరారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా డాక్టర్ బి.మధుసూదన్‌రెడ్డి వ్యవహరిస్తారని చెప్పారు.

## ఎన్యుమరేటర్లకు శిక్షణా తరగతులు



కోట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు అగ్రస్థానంలో నిలవాలని వెలుగు ఎపిఎం అనిల కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఎన్యుమరేటర్లకు బుధవారం రెండోరోజు శిక్షణా తరగతులు నిర్వహి ంచారు. మహిళలు ఆర్థిక సాధికారతకు బాటలు వేసుకోవాలన్నారు. కుటుం బాలను ఆర్థికంగా చక్కదిద్దుకోవాలన్నారు. అప్పుల కోసం ఎదురు చూడకుండా ఎలాంటి పూచీకత్తు లేకుండానే అవసరమైన రుణాలను బ్యాంకు నుంచి పొందాలని కోరారు. 30 ఏళ్లకుపైగా పొదుపు సంఘాలు జీవన విధానంలో మార్పులు తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిసిలు, విఓఏలు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యలకు నిలయంగా సచివాలయం

దొరవారిసత్రం ఏప్రిల్ 2 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం పోలిరెడ్డిపాలెం సచివాలయం అక్కరపాక రెవెన్యూ పరిధిలో రెవెన్యూ సమస్యలకు నిలయంగా మారుతున్న పట్టించుకోని అధికారులు. అక్కరపాక రెవెన్యూ పరిధిలో గత సంవత్సరం కాలంగా వందల సంఖ్యలో బాధితులు రెవెన్యూ సమస్యలపై అర్జీలు ఇచ్చినపటికి ఇంత వరకు ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

**ప్రజలకు అందని ద్రాక్షాలా మారిన రెవెన్యూసేవలు:**

పోలిరెడ్డిపాలెం సచివాలయ పరిధిలోని అక్కరపాక, పోలిరెడ్డిపాలెం పంచాయితీల ప్రజలు వారి రెవెన్యూ సమస్యల కొరకు సచివాలయానికి ఎప్పుడు వెళ్ళినా సంబంధిత విఆర్‌వో అందుబాటులో ఉండడంలేదని స్థానిక ప్రజలు వాపోతు న్నారు. కనీసం చదువుతున్న పిల్లల ఆదాయ, కుల సర్టిఫికెట్ల కోసం కూడా సచివాలయం వద్ద పడికాపులు కాసిన పనులు జరగట్లేదని బాధితులు వాపోతు న్నారు. ఉన్నత అధికారులు ఇకనైనా చొరవ తీసుకుని సంబంధిత రెవెన్యూ అధికారి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్‌డే : ఎమ్మెల్యే



సూళ్లూరుపేట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : నియోజకవర్గంలో ప్రజాసమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకే గ్రీవెన్స్‌డే ప్రతి బుధవారం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆమె గ్రీవెన్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, వేమసాని శ్రీనివాసులు నాయుడు, పచ్చా మాధవనాయుడు, ఎజి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీ సీఈఓ, ఎంపీడీవోకు ఫిర్యాదు చేసిన నేతలు



వెంకటగిరి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : మండల సమావేశంలో తనను బయటకు పొమ్మని ఎంపీడీవో కోటేశ్వరరావు అవమానపరిచారని పారవోలు ఎంపీటీసీ పి శ్రీదేవితో కలిసి ఎమ్మెల్సీ మేరుగ మురళీధర్ జడ్పీ సీఈఓ విద్యా రమకు ఫిర్యాదు చేశారు. తనను మండల సమావేశానికి రమ్మని ఎంపీడీవో సమాచారం పంపారని అయితే సమావేశానికి వెళ్ళగా తనను బయటకు వెళ్ళమని చెప్పి అవమాన పరిచారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు ప్రజాప్రతినిధుల ముందు తనను ఎంపీడీవో అవమానించానని ఆవేదన చెందారు. విచారించి న్యాయం చేస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలెం కోట సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి, సోమసానుగుంట మాజీ సర్పంచ్ తిరుమల, సదానందరెడ్డి ఉన్నారు.

## స్మశాన వాటికకు విద్యుత్ సౌకర్యం కల్పించండి



నాయుడుపేట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : పట్టణంలోని తుమ్మూరు గ్రామ సమీపంలో ఉన్న స్మశాన వాటికకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు బుధవారం మున్సిపాల్టి కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తుమ్మూరులో దాత సన్నారెడ్డి రాజారెడ్డి సౌజన్యంతో సుమారు కోటి ముఫైలక్షల వ్యయంతో నిర్మించిన స్మశానవాటికకు తాగునీరు, విద్యుత్ సౌకర్యంలేక అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. స్మశానవాటిక పనులు పూర్తిచేసి నెలలు గడుస్తున్న సౌకర్యాలు కలించాలని మున్సిపాల్టీ అధికారులకు పలు దపాలుగా విన్నవించిన పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపించారు.

## గంజాయి స్వాధీనం - ఇద్దరు నిందితులు అరెస్టు



పుత్తూరు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: వడమాలపేటలో 700 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు పుత్తూరు ఎక్సైజ్ సీఐ మురళీమోహన్ పేర్కొన్నారు. తిరుపతి జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి నాగమలేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు వడమాలపేట మండలం మహాలక్ష్మమ్మ దేవాలయం సమీపంలోని గుంటకట్ట వీధిలో వల్లెమ్మ ఇంటిలో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు తనిఖీ నిర్వహించామన్నారు. వారి వద్ద 700 గ్రాములు గంజాయి ఉందన్నారు. వాటివిలువ రూ.9.600 ఉంటుందన్నారు. గంజాయి స్వాధీనం చేసుకుని వల్లెమ్మ, ఆమె కుమారుడు డిల్లీ ప్రసాద్‌ని అరెస్టు చేశామన్నారు. వారి వద్ద ఉన్న మొబైల్‌ని స్వాధీనం చేసుకుని, ఈ ఇద్దరిపై 2016-17లో గంజాయి కేసులో అరెస్టు కాబడి ఏడాది పాటు జైలుశిక్ష, రూ.10 వేలు జరిమానా కట్టారన్నారు. పుత్తూరు పరిధిలో ఎక్కడైనా గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం ఉంటే 9440902545కు సమాచారం ఇవ్వవచ్చున్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ శివప్రసాద్, స్వామినాథన్, హెడ్ కానిస్టేబుల్ రవి, చంద్రశేఖర్, సిబ్బంది మునిరెడ్డి, డేవిడ్, చిరంజీవి, మెహతాజ్, హారతి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా మహాభారత శ్రీకారం కొడోత్సవం



వెదురుకుప్పం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : చవటగుంట మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాలు భాగంగా బుధవారం సాయంత్రం శ్రీకారం కొడి ఉత్సవంతో అంకురార్పణ చేశారు. మండల కేంద్రంలోగల శ్రీకృష్ణ ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయం వద్ద పురోహితులు గౌరీ శంకర్ ఆధ్వర్యంలో పంచపాండవుల, అమ్మవారి మూలవిరాట్, ఉత్సవ మూర్తులకు వివిధ అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలతో అలంకరించి వేదమంత్రాలు, మంగళవాద్యాలు నడుమ పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు చేపట్టారు. దైవ దర్శనం కల్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఉత్సవమూర్తులను ఊరేగింపుకు ఆయవాయితి ప్రకారం వెదురుకుప్పం గ్రామంకు తీసుకువెళ్ళడం జరిగింది. ఈ కార్యక్రమంకు బండిసోమసుందర్‌రెడ్డి ప్రేమలత దంపతులు, కుమారుడు విష్ణుశివరెడ్డి, కుమార్తె కీర్తనరాయ్‌లు ఉభయదాతలుగా వ్యవహరించారు ఏప్రిల్ 24 నుండి పది రోజుల పాటు హరికథ, రాత్రి వీధినాటకాలు జరుగుతాయన్నారు. ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణా రెడ్డి, మాజీ ధర్మకర్త బండి ఉమాపతి రెడ్డి, ముఖ్య కార్యనిర్వహకులు ఆంజనేయులు రెడ్డి, కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, ఆనందరెడ్డి, జీవన్‌బాబు, హరినాధరెడ్డి, జయరాం, లోకనాథరెడ్డి, జయరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మల్లవరం-నాయుడుపేట జాతీయ రహదారుల...**

## విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్**



తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : మల్లవరం-నాయుడుపేట 4, 6 లైన్ల జాతీయ రహదారుల విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ చాంబర్‌లో మల్లవరం- నాయుడుపేట జాతీయ రహదారుల రోడ్ల విస్తరణ పనులపై జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, వర్చువల్‌గా నేషనల్ హైవే చెన్నై పీడీ రవీంద్రరావుతో కలిసి సమీక్షిస్తూ మల్లవరం- నాయుడుపేట జాతీయ రహదారి 4,6 లైన్ల విస్తరణ కారణంగా క్రాస్ చేసే చెరువుల వద్ద సప్లై ఛానెల్స్ వద్ద రోడ్ల విస్తరణ పనులకు సంబంధించి ఇరిగేషన్ శాఖ అధికారులను సంప్రదించి త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్ ప్రసాద్, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వేదమంత్రాలతో వాస్తు హోమం



వడమాలపేట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: అప్పలాయగుంటలో నిర్వహిస్తున్న ధ్వజస్తంభ సంప్రోక్షణ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం వేదమంత్రాలతో అగ్ని, వాస్తు హోమం నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ నిర్వహించారు. అనంతరం యాగశాలలో ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యుల ఆధ్వర్యంలో హోమం, వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి 8.30 గంటల వరకు కళాపకర్షణ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## యాదవుల సంక్షేమానికి కృషి

**-నరసింహయాదవ్ ప్రమాణస్వీకారంలో తిరుపతి నేతలు**



తిరుపతి, ఏప్రిల్ 2ప్రభాతవార్త: తిరుపతికి చెందిన సీనియర్ టిడిపి నేత, ఎన్టీఆర్ అభిమాని తిరుపతి పార్లమెంట్ ఇన్‌ఛార్జి, రాష్ట్రయాదవ సంఘం అభివృద్ధి ఛైర్మన్ జి.నరసింహయాదవ్ ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేశారు. విజయవాడలో జరిగిన ఈ ప్రమాణస్వీకారానికి తిరుపతి టిడిపి నేతలు ఎం.సుగుణమ్మ, మునిరామయ్య, ఆర్‌పి శ్రీనివాసులు, పాతకం వెంకటేశ్, మునిశేఖర్‌రాయల్, శంకర్ యాదవ్ తదితరులు పాల్గొని గజమాలతో సన్మానించారు. ఆత్మీయ అభినందనలు తెలిపారు.

## బాధితులకు మెరుగైన వైద్యసేవలందించండి

**-డాక్టర్ శ్రీహరిరావును సన్మానించిన భాస్కర్**




తిరుపతి, ఏప్రిల్ 2ప్రభాతవార్త: ప్రస్తుత పరిస్థితుల్లో అనేక రకాల వ్యాధులతో బాధపడుతున్న పేదలు, ఆర్థికంగా వెనుకబడిన వారు, వైద్యంకోసం ఇబ్బందులు పడుతున్నారని, అలాంటివారికి మెరుగైన వైద్యసేవలందించాలని బిజెపి నేత పొనగంటి భాస్కర్ కోరారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ నూతన సభ్యుడుగా ప్రమాణస్వీకారం చేసిన డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావును బుధవారం విజయవాడలో భాస్కర్ కలిశారు. దుశ్శాలువతో సన్మానించి అభినందనలు తెలిపారు.

## నిర్మాణ వ్యర్థాలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలి : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: నగరంలో ఎక్కడా భవన నిర్మాణ వ్యర్థాలు, చెత్త కుప్పలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం నగరంలోని గ్రీన్ పార్క్ అపార్ట్మెంట్, డిఆర్ మహల్ రోడ్డు, హరేరామ హరే కృష్ణ మార్గం, న్యూ బాలాజి కాలనీలోని ట్రాన్స్ఫర్ స్టేషన్, అన్నా క్యాంటీన్‌ను అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని పలు చోట్ల భవన నిర్మాణ వ్యర్థాలు ఉంటున్నాయని వాటిని వెంటనే శుభ్రం చేయించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. రాత్రి సమయాల్లో స్వీపింగ్, చెత్త కుప్పల తొలగింపు ప్రతి రోజూ చేయాలని అన్నారు. గ్రీన్ పార్క్ అపార్ట్మెంట్ వద్ద ఏర్పాటు చేసిన చెత్త నిర్వహణ పాయింట్ లాగే అపార్ట్మెంట్ ల వద్ద చేసేలా చూడాలని, ఇస్కాన్ వంటశాల వద్ద తడి చెత్తతో గ్యాస్ ఉత్పత్తి చేస్తున్న విధంగా హోటల్స్ వారు చేసుకునేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అన్నా క్యాంటీన్ ను శుభ్రంగా ఉంచుకోవాలని, సరైన వేళల్లో ఆహార పదార్థాలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.లు మహేష్, రమణ, మధుబాబు, ఏసిపి బాలాజి, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

## మంగళం తుడ క్వార్టర్స్‌లో చోరీ



తిరుచానూరు, ఏప్రిల్ 2ప్రభాతవార్త: తిరుపతి రూరల్ మంగళం తుడ క్వార్టర్స్‌లో ఓ ఇంట్లో చోరీ జరిగింది. దుండగలు ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో విలువైన వస్తువులు చోరీ చేసుకెళ్ళారని బాధితుడు తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కరకంబాడిరోడ్డు మంగళం తుడ క్వార్టర్స్ ఎంఐజి 510లో పి.వెంకటరాజు కాపురము ంటున్నాడు. గుంటూరుకు వెళ్ళి తిరిగి మంగళవారం తిరుపతికి చేరుకున్నాడు. ఇంటి తాళాలు తొలగించి దొంగలు చోరీ చేసుకెళ్ళారని గుర్తించాడు. ఇంట్లోని విలువైన బంగారు ఆభరణాలు 51గ్రాముల రెండు నెక్లెస్‌లు, బంగారు కమ్మలు 8గ్రాములు, జత గాజులు 24గ్రాములు, లాకెట్‌తో ఉన్న బంగారుచైను 15గ్రాములు, వెండి వస్తువులు 500గ్రాములు, లక్షరూపాయలు నగదు మొత్తం చోరీకి గురైనట్లు బాధితుడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేశారు.